
# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

మే 2026

వెల : రూ. 10.00



ఫిబ్రవరి 23 నుండి 25 వరకు పెదపులిపాక, శ్రీ విజయరాజరాజేశ్వరి దేవి ఆలయ దశమ వార్షికోత్సవాలలో శ్రీమాతాజీ










ఏప్రియల్ 11, 12 తేదీలలో శ్రీ కాళీవనాశ్రమం, జలగావ్, మహారాష్ట్ర, శాఖలో శ్రీ మాతాజీ

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45 సంచిక 9
పేజీలు 44
మే 2026

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా**
**మేనేజరు**
**సమర్థ సద్గురు మాగజైన్**
**శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు**
**గుంటూరు జిల్లా**

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట........................................ ................. 8
అర్థమనర్థం ....... ...... ..... ......... ....................................10
నాదోపాసన .......................................................11
భగవద్గీత సాధన దీపిక ...............................13
శ్రీ మాతాజీవారి విదేశీ పర్యటన..........15
స్వామి దయానంద మహరాజ్.... ...................16
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ......... 18
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 20
నారద భక్తి సూత్రములు ................ ..............22
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....25
అడిగినప్పుడు టిక్కెట్ చూపవలెను......26
మాయా విలాసం............................ .................28
దైవాధీనమ్ భిక్షాం దేహి...........................30
నిరీక్షణ .................................................................33
శ్రీ గురుగీత ............................................ ........35
గురుకృప ......................................... .............37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ....................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్



12. *పూవు పూయమని కాయ కాయమని*
*బ్రతిమాలనగునె, సాధనయె నీవంతు*
*ఫలము కాలమున వచ్చు శివేచ్ఛను*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*

తా: కొంతమంది జనులు ఏదో కొద్దిగా సాధన చేసి వెంటనే ఫలితం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూ ఉంటారు. ఒక విత్తనం భూమిలో నాటాక దానికి తగినంతగా నీరు, ఎరువు అందించి, కలుపు మొక్కలను తీసివేసి, అనుకూల వాతావరణం కల్పిస్తే కాలానుగుణంగా దానంతటదే మొలకెత్తి, పెరిగి, కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు, చివరికి కాయలు కాసి మనకు ఫలాలను అందిస్తుంది. అంతేగానీ మనం రోజూ దానివద్ద కూర్చొని 'ఇప్పుడు రెమ్మలు తొడుగు, ఇప్పుడు కాయలు కాయి' అని బ్రతిమాలాలా? ఒకవేళ బ్రతిమాలితే మాత్రం తగిన సమయం రాకుండా అవన్నీ జరుగుతాయా? అలాగే మోక్షగామివై ఆధ్యాత్మిక సాధన చేయటం మాత్రమే నీ కర్తవ్యం. ఆ మోక్ష ఫలాన్ని నీకు ఎప్పుడు ఇవ్వాలో పరమాత్మ చూసుకుంటాడు.

1) రాజుగారు ఇచ్చిన గుమ్మడికాయలో ఏముంది?
2) ఏ మహాత్ముని గుర్తించక వంటగదిలో పాత్రలు శుభ్రపరచడానికి నియమించారు?
3) దేహం చాలించే రోజునే సన్న్యాసం తీసుకున్నది ఎవరు?
4) సొంత కొడుకుని చూసి కుడా భయపడేవాడు ఎవరు?
5) ఆధ్యాత్మిక సాధకులకు నిజమైన క్రొత్త సంవత్సరం ఎప్పుడు మొదలవుతుంది?
6) రెండు రోజులుగా దగ్గుతున్న ఆవిడ దగ్గు హటాత్తుగా ఎలా మాయమైంది?

*సమాధానాలు లోపలి పేజీలలో ...........................*

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

7-11-1981

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ రామాలయంలో వాకింగ్ చేస్తూండగా ఆశ్రమ గురుకులంలో పిల్లలు స్వామి దర్శనార్థం వచ్చారు. పిల్లలకి ఉద్బోధిస్తూ, "ఓరేయ్ మీరంతా 'హరేరామ హరేరామ రామ రామ హరే హరే' అనే షోడశాక్షరీ మంత్రం చెప్పండి" అన్నారు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ, 'ఇది 16 అక్షరాల మంత్రం. దీనిని జపిస్తే ఈ నామంలోని శక్తి మీలో ప్రవేశించి మీకు మంచి విద్య వస్తుంది. మంచి మేధాశక్తి, తెలివి ప్రాప్తిస్తాయి. ఈనామం ద్వారా మీరు దేశ నాయకులు కావచ్చు, లేదా దేశభక్తులు అవవచ్చు. దేశనాయకులైతే మంచి రాజ్యపాలన చేస్తారు. దేశభక్తులై జ్ఞానాన్ని పొందవచ్చు" అన్నారు. శ్రీబాబూజీ ఇంకా మాట్లాడుతూ 'మీకు ఎప్పుడైనా భయం వేసిందనుకోండి. మీరు ఎవరినీ తలుచుకో నవసరంలేదు. ఓ కృష్ణా! అనో, ఓ వాసుదేవా! అనో లేక ఓ రామా! అనో పిలవండి చాలు. రాముడికి కృష్ణుడికి తేడా లేదు. శివుడికి రాముడికి తేడా లేదు. శివుడు దయాస్వరూపుడు. భగవంతుడు ఇచ్చేది ఎవరైనా ఇవ్వగలరా? భగవంతుని ధ్యానిస్తే మీకు సకల భోగభాగ్యాలు కలుగజేస్తాడు. మీరు సుగుణములనే పొందుతారు" అన్నారు. తర్వాత పిల్లలనందరిని హరేరామ నామస్మరణ చేసుకుంటూ కాసేపు రామాలయం చుట్టూ తిరగమన్నారు.



తర్వాత వెంకటరత్నంగారు ఒక వ్యాసం చదివారు. శ్రీ బాబూజీ మధ్యలో కలుగజేసుకొని 'నిజమైన సన్యాసి అంటే ఎవరు? కాషాయ వస్త్రాలు ధరించినవాడా? ముండిత శిరస్సు కలవాడా? చెప్పండి. కొంతమంది ఇంకా ఆకర్షవంతంగా మెడలో రుద్రాక్షమాలలు, తులసిమాలలు ధరిస్తారు. మరికొంతమంది జటాధారులై వుంటారు. వీరందరిలో ఎవరు సన్యాసులో చెప్పండి?' అని ప్రశ్నించారు. అంతా మౌనంగా ఉన్నారు.

"ఇటువంటి వారందరిని చూసి అమాయకులైన మానవులు మోసపోతారు. నిజమైన సన్యాసి బాహ్య ఆడంబరాలకు స్థానం ఇవ్వడు. సన్యసించవలసినది మనస్సు.

కాషాయం ధరించవలసినది మనస్సు. బొప్పనం పొందవలసింది మనస్సు కాని శిరస్సు కాదు. శిరస్సుమీద వెంట్రుకలు మంగలి కత్తితో తీసినకొద్దీ వస్తాయి. మనస్సులో కూడా సంకల్పాలు అంతకన్న ఎక్కువ వేగంగా బయలుదేరతాయి. తలమీద వెంట్రుకల్ని మంగలి కత్తితో ఛేదించవచ్చుగాని మనస్సులోని సంకల్పాలని జయించటం చాల కష్టం. కాని వాటిని జయించే మార్గం లేకపోలేదు. మనస్సులోని సంకల్పాలని జయించాలంటే గురులక్ష్యార్థమనే శస్త్రముతో నిర్మూలించవచ్చు. ఒక్క సంకల్పాన్ని జయిస్తే చాలు మిగిలినవాటిని తేలికగా జయించవచ్చు. మనస్సుని జయించనివాడు ఎన్ని కాషాయములు ధరించినా ఒక్కటే. ఒక్కక్షణం మనస్సు ఏకాగ్రత కుదిరినవాడి పాదధూళి శిరస్సుపై ఉంచుకోవచ్చు. ఒక్కక్షణం మనస్సు నిల్పినవాడు ఎంతసేపైనా నిలప గలుగుతాడు. మనస్సు కాషాయం ధరించినవాడు స్త్రీపురుష అభేదస్థితిని పొందుతాడు. వాడు ఎక్కడఉన్నా వాడి మనస్సు పరమాత్మ ఆధీనమై ఉంటుంది.

నపుంసకుడు ఉన్నాడనుకోండి. స్త్రీలమధ్య ఉన్నా పురుషుల మధ్య ఉన్నా ప్రమాదంలేదు. కాని నపుంసకుడిగా నటించే వాడివలన ఎంత ప్రమాదం కలుగుతుందో ఆలోచించండి. కాలాన్ని దుర్వినియోగం చేయకండి. మీలోని గుణాలను బియ్యంలో రాళ్ళు ఏరినట్లు ఏరివేయండి. కాని నపుంసకులుగా నటించకండి. కాలము, కంటిదృష్టి రెండూ పరిణామము చెందేవే. ఈనాడు నీ కంటికి ఆకర్షవంతంగా కనపడేది, రేపు మార్పు చెందుతుంది. కాలము తొందరగా పరిణామము చెందుతుంది. కంటిదృష్టి మాత్రం నిదానముగా పరిణామము చెందుతుంది. కాని ఈ రెండింటిని ప్రకాశింపజేస్తూ పరిణామము చెందనిది ఒకటి ఉంది. అదే ఆత్మ తేజస్సు లేక రామతేజస్సు. అది సర్వత్రా వ్యాప్తిచెంది ఉంటుంది.

మారుతి రామచంద్రుని ఉద్దేశించి 'స్వామీ! నీ తేజస్సే జగన్మాత అయిన సీతమ్మతల్లి' అంటాడు. శ్రీరామచంద్రుడు అది విని, సీతమ్మ తల్లితో అంటాడు. 'భాగ్యమంటే నీదే సుమా. మారుతి చూడు నిన్ను ఎలా అమ్మా! అని పిలుస్తున్నాడో మన ఇరువురి పాదసేవ చేసుకుంటూ అనుక్షణం మనస్సు మనయందే నిలుపుకున్నాడు. అంతటి భక్తుని సేవ అందుకోవటం ఎంత భాగ్యమో కదా! మన యిరువురి ప్రకాశము మనపాదములను సేవించే మారుతిదే కదా! మన ప్రకాశమంతా భక్తులదే కదా!' అంటాడు. చూడండి. ఆ పరమాత్ముని ప్రేమ ఎలా ఉంటుందో?" అన్నారు శ్రీ బాబు.

శ్రీబాబు మళ్ళీ మాట్లాడుతూ శ్రీ రామచంద్రుడు 16 ఏండ్ల ప్రాయంలో వుండగా వసిష్ఠుల వారిని 'ఇంతమంది మహర్షులు, ఋషులు కొన్నివేల

సంవత్సరాలనుండి ఉన్నప్పటికినీ నన్నే పరమాత్ముడు అంటారేమిటీ?' అని ప్రశ్నిస్తాడు. దానికి వసిష్ఠుల వారు సమాధానం చెపుతూ 'అది నిజమే. నాకూ అలానే అనిపిస్తుంది. నీ సుందరరూపం చూడగానే ఆలింగనం చేసుకోవాలనిపిస్తుంది. దానికి కారణం మానవునిలోని లక్షణాలు నీలో లేకపోవటం, పరమాత్మునిలో లేనివి నీలో లేకపోవటం. అందువలన పరమాత్మకు నీకు తేడా లేదు. నీవే పరమాత్ముడవు' అన్నారు.

చూశారా తత్త్వవిచారణ ఎంత ఆనందాన్నిస్తుందో! ఎంత టైము అయినది కూడా మనకు తెలియలేదు. పాపం ఆవిడ చూడండి. రెండు రోజులుగా దగ్గుతో బాధపడుతున్నారు. రాత్రంతా దగ్గుతూనే ఉన్నారు. నాకు వినపడుతూనే ఉంది. మీలాగా నాకూ చెవులు ఉన్నాయి కదయ్యా! అందువలన వినపడుతోంది. ఏమిటయ్యా వెంకటరత్నం అలా చూస్తావూ? లేకపోతే ఎవరైనా చెప్పారనుకున్నావా? మరి మనము ఇంతసేపు తత్త్వ విచారణ చేశాముకదా? ఆవిడ దగ్గు ఏమైంది? భగవన్నామంలో అంత మహిమ ఉంది. ఈ ఒక్క example జ్ఞాపకం ఉంచుకోండి చాలు' అన్నారు.

శ్రీ బాబు ఇంకా మాట్లాడుతూ 'భగవన్నామము మనస్సునే మరపింప జేసినపుడు ఇక దగ్గు ఎక్కడ నుంచి వస్తుంది? కాబట్టి మనస్సు సన్యసించినపుడు గృహస్థాశ్రమంలో ఉన్నా నిన్ను ఏదీ బంధించలేదు. సర్వత్రా పరమాత్మనే దర్శించినపుడు ఇక అహంకార మమకారాలకు తావు ఎక్కడ? మాములుగా భార్యాపిల్లల్ని చూసి హుంకరించే మానవుడిలో సైతం ప్రేమ కలుగుతుంది. ఇంక అహంకారానికి తావు ఎక్కడిది? ఇది మీ అందరికి నిజజీవితంలో అనుభవమేగా? కాదని ఎవరైనా గుండెమీద చెయ్యి వేసుకొని చెప్పండి చూద్దాం.

మీరంతా గృహస్థాశ్రమంలోనే ఉండి సన్యసించండి. అంతేగాని వేషాలు మార్చి సన్యాసులు కాకండి' అని హెచ్చరించారు.

**నిజమైన సత్యగురువు లభ్యమయినప్పుడు జన్మాంతర వాసనలన్నీ పటాపంచలవుతాయి. పరిపూర్ణమైన ఆనందం, సంపద, ఐశ్వర్యాలు సంప్రాప్తమవుతాయి. సత్యగురువు కృపా వీక్షణాలు సదా ప్రసారమయ్యే గృహం ఆనందదాయకమే అవుతుంది.**

\- శ్రీ కాశీబాబు

## అమ్మ మాట - జపమాలా ప్రసాద

# గురుమతం

"మామూలుగా అందరికీ చైత్ర శుద్ధ పాడ్యమి నుండి క్రొత్త సంవత్సరం మొదలయితే, సద్గురుదేవులైన శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీ ప్రసాద్ బాబూజీ మహరాజ్ వారు, ఆధ్యాత్మిక సాధకులకి, ఈ దేవీనవరాత్రి సమయమే క్రొత్త సంవత్సరారంభం అన్నట్టు నేర్పించి, తమ యొక్క దివ్య బోధామృతంతో జన్మ జన్మాంతరాల నుండి మన మనసులకి పట్టి వున్న దుమ్ముని దులిపి వదిలిపెట్టేవారు. నల్లని వెంట్రుకలో తెల్లని వెంట్రుక దాగి వున్నట్టు, వడ్ల గింజలో బియ్యపు గింజ వున్నట్టు, జీవుడిలోనే ఈశ్వరుడు దాగివున్నాడు. ఈ రహస్యం తెలియజేయడానికే మహాత్ములుద్భవించి మనకి బోధచేస్తూంటే, భోజనాలకీ, టిఫిన్‌కీ టైమిస్తున్నారు గానీ, శాశ్వతానందమును, శాంతిని యిచ్చే గురుబోధని విడిచి పెట్టేస్తున్నారు మానవులు.



పూజలు చేయడం వలన, భజన చేయడం, సంఘ సేవ చేయడం – ఇవన్నీ కూడా, కేవలం మనం ఆ పరమధామానికి చేరుకునే మార్గాలు మాత్రమే. నిజమైన సాధకుడు, ఎప్పటికప్పుడు ఆత్మ విమర్శ చేసుకోవాలి. 'నా గురుదేవుడు నన్ను రక్షిస్తారు' అనే విశ్వాసం ఆరూఢంగా వుండాలి. 'ధీ – బుద్ధిని – యానం' (మంచి మార్గంలో) నడిపించేదే 'ధ్యానం'. ఆ ధ్యానం ద్వారా పుట్టిన ధ్యానాగ్ని మనలోని ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మలని దగ్ధం చేసి, మనలని 'విభూతి' స్వరూపులుగా మారుస్తుంది. ఎల్లవేళలా యితరులకు మంచినే చేస్తూ, యితరులయందు మంచినే చూస్తూ, మంచినే ఆలోచిస్తూ వుండటమే సాధనకి ఫౌండేషన్ (పునాది). మన మనస్సు చేసే ఆలోచనే మనకి బంధమోక్షాలని తెచ్చిపెడుతుంది.

సత్యాసత్యాలను తెలుసుకోడానికే మానవజన్మ వచ్చినది. దానిని తెలుసుకోకుండా దుర్వినియోగం చేసుకున్నవాడు మానవుడు కాదు – 'ద్విపాద పశువు' అవుతాడు. అణువణువులోనూ సత్యం దాగి వుంది. దానిని గుర్తించాలి.

సున్నలెన్ని వున్నా, వాటికి ముందు '1' వుంటేనే ఆ సున్నలన్నింటికీ విలువ. అలాగే, ఆ భగవంతుడు అనే 'ఒక్కడు' వుంటేనే, సున్నలైన మనందరికీ విలువ. నా మతము, నా కులము, నా జాతి, నా ఊరు, నా దేశము అని అడ్డుగోడలు కట్టేసుకుని,

కుత్సితమతులై, అశాంతి పాలయిపోతున్నారు మానవులు. అటువంటి 'చిన్న' మనసులు కల మానవులు విశ్వానికే నాధుడైన విశ్వనాధుడిని (భగవంతుడిని) ఆశ్రయిస్తే వారి మనస్సులు కూడా విశాలమై, ఆ పరమాత్మ యొక్క 'విశ్వ' రూపాన్నే పొందుతారు.

మనది 'గురుమతం', 'గురు' అంటే పెద్దది. 'గురు' అంటే అజ్ఞానాంధకారాన్ని రహితం చేసే తేజస్సు. అది సర్వ సమ్మతమైన మతం. ఎన్ని నదులు వచ్చినా లోనికి ఇముడ్చుకునే సముద్రం లాంటిది గురుమతం. అందులో జాతి, నీతి, కుల, గోత్రభేదాలు లేవు. మతిని స్థిమిత పరచేది; బుద్ధిని ఏకాగ్రత చేసేది 'గురుమతం'. అట్టి గురుపాదుకలు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి సర్వులనూ కాపాడుగాక!"

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**మే 2026**

**1 శుక్ర –(వైశాఖ) గురు పూర్ణిమ – సా.5.30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన**

**12 మంగళ – శ్రీగురుదశమి – సా.5.30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన**

**31 ఆది – అధిక జ్యేష్ఠ పూర్ణిమ – ఉ.11 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన**

**జూన్ 2026**

**10 బుధ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**29 సోమ: నిజ జ్యేష్ఠ పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

# అర్థమనర్థం

- పాలూరి కాళీప్రసాద్

**అర్థమనర్థం భావయ నిత్యం నాస్తితతః సుఖలేశస్సత్యమ్ । పుత్రాదపి ధనభాజాం భీతిః సర్వత్రైషా విహితా రీతిః ॥**

డబ్బు యొక్క విలువ ఏమిటో ఈ భజగోవింద శ్లోకంలో జగద్గురువులు వివరిస్తున్నారు. మనందరం మన జీవితాలలో డబ్బుకి చాలా ప్రాముఖ్యత ఇస్తాం. డబ్బు ఉంటే మనం కోరుకున్న అన్ని సుఖాలూ యధేచ్ఛగా పొందవచ్చు అనుకుంటాం. తగినంత డబ్బు దగ్గర లేకపోతే భయపడతాం. కానీ ఇక్కడ స్వామివారు డబ్బు వలన ఏమీ ప్రయోజనం లేదని చెబుతున్నారు. అలాగే దానివలన లేశమాత్రమైనా సుఖం లేదని కూడా చెబుతున్నారు. ఇంకా డబ్బులున్నవాడు తన సొంత పుత్రునికే భయపడతాడు అని కూడా చెబుతున్నారు. అదెలాగో చూద్దాం.

డబ్బు బహు చంచలమైనది. లక్ష్మీదేవి నామాలలో కూడా **ఓం చంచలాయై నమః** అని, **ఓం చపలాయై నమః** అని నామాలు వుంటాయి. ఈనాడు నీ చేతిలో ఉన్న డబ్బు మర్నాడు ఎవరి చేతిలోకి వెళ్ళిపోతుందో ఎవరూ చెప్పలేరు. ప్రతిరోజూ మన షేర్ మార్కెట్ ఉత్థాన పతనాలు చూస్తూనే ఉన్నాం కదా. క్షణాలలో లక్షల కోట్ల సంపద ఆవిరైపోతోంది. అలాగే డబ్బు వలన కలిగే సుఖం కూడా మన భ్రమే.

శ్రీ బాబూజీ మహరాజ్ వారు చెప్పేవారు – విమానంలో ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణిస్తున్న ధనవంతుడికి ఉన్నట్టుండి విపరీతమైన కడుపునొప్పి వస్తే ఆ విలాసవంతమైన సీటు అతనికి ఏమైనా సుఖంగా అనిపిస్తుందా? అలాగే డబ్బు లేనివాడు నడిరోడ్డు మీద అయినా సుఖంగా నిద్రపోతాడు. అవసరానికి మించిన డబ్బు దగ్గర పెట్టుకున్నవాడికి నిద్ర ఎక్కడిది. అనుక్షణం ఎవరు ఎటునుంచి వచ్చి తన డబ్బు కొట్టేస్తారో అని భయపడుతూనే ఉంటాడు. శ్రీ బాబూజీ మహరాజ్ వారు ఒక సంఘటన చెప్పేవారు. ఒక వ్యాపారస్తునికి తన ధోవతి లోపల గుడ్డ సంచీ కుట్టించుకొని అందులో డబ్బు పెట్టుకోవడం అలవాటు. ఒకసారి రైల్వే ప్లాట్‌ఫారం మీద పడుకోవలసి వచ్చింది. ఇంక అతనికి నిద్ర ఏమి పడుతుంది? రాత్రంతా బిక్కుబిక్కుమంటూ కూర్చొని అలసటకి రెప్పవాల్చగానే అప్పటిదాకా గమనిస్తూనే ఉన్న దొంగవాడు బ్లేడుతో అతని పంచెను కోయడం, అది తగలరాని చోట తగిలి ఇతను ఆస్పత్రిపాలు కావడం జరిగిపోయాయి.

అంతెందుకు 'ఈ డబ్బు నాది, నాది' అనుకునే వాడు సొంత కొడుకుని చూసినా భయపడుతూనే ఉంటాడు. తాను మధ్యవయసులో ఉన్నపుడు యవ్వనుడైన కొడుకు తన డబ్బును ఎక్కడ విలాసాలకు ఖర్చు పెట్టేస్తాడో అని భయం! తాను వృద్ధుడు అయిన తరువాత ఆస్తంతా కొడుకు చేతిలో పెడితే ఎక్కడ తనను కట్టుబట్టలతో బయటకు వెళ్ళగొడతాడో అని భయం! ప్రశాంతంగా రామా కృష్ణా అనుకోవలసిన వయసులో ఇంకా దస్తావేజులు, ఇన్కమ్‌ట్యాక్స్‌లు అనుకుంటూ శ్రమపడుతూ నిరంతరం చింతిస్తూ ఉంటాడు.

- సశేషం

(గత సంచిక తరువాయి) # నాదోపాసన

-భాగవతుల హనుమత్ జయప్రద

ఒకసారి త్యాగయ్య శిష్యుడు వేంకట రమణ భాగవతార్ తన గురువు కోసం శ్రీరామచంద్ర స్వామి చిత్రపటం గీయించి 10 క్రోసుల దూరం నడచి త్యాగయ్యకు సమర్పించాడు. పటంలోని శ్రీరామచంద్రుని అందాన్ని చూస్తూ ఆర్ద్రతతో- **'నను పాలింపగ నడచి వచ్చితివా నా ప్రాణనాథ... కరమున శరకోదండ కాంతితో ధరణీ తనయతో... నను పాలింపగ నడచి వచ్చితివా'** అని కీర్తించారు త్యాగరాజస్వామి. త్యాగయ్య దివ్యసంకీర్తనలతో పాటు సంప్రదాయ కీర్తనలు సైతం రచించారు. ప్రహ్లాద చరిత్ర, నౌకాచరితం అనే గేయ రూపకాలను ఆయన రచించారు.

ఒకసారి ప్రసిద్ధ సంగీత కళాకారిణి రమణ మహర్షితో 'అయ్యా! త్యాగరాజస్వామి సంగీతసాధన ద్వారా భగవంతుణ్ణి చేరుకున్నారు కదా! నేను కూడా వారిని అనుసరిస్తే నాలుగవ పురుషార్థం (మోక్షం) సిద్ధిస్తుందా?' అని అడిగారు. .అప్పుడు రమణమహర్షి చెప్పిన మాటలు ఇవి - 'త్యాగరాజు పాటలుపాడి పొందలేదు. పొందిన దానిని పాడారు. అందువల్లనే ఆ సంగీతం సజీవంగా, శాశ్వతంగా ఉంది' అన్నారు.

ఆధ్యాత్మికంగా ఉన్నతస్థాయిలో త్యాగయ్య తనకు సిద్ధించిన ఆ అనుభూతిని మన అదృష్టం కొద్దీ కీర్తనలుగా పాడారని రమణమహర్షి మాటలలోని ఆంతర్యం. సాధారణ సంగీత కళాకారులు కీర్తనలు పాడి ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొందాలని తపిస్తారు. త్యాగరాజ స్వామి ఆధ్యాత్మికంగా ఉన్నతిని పొంది, మన కోసం కీర్తనలుగా ఆ అనుభూతిని మాటలలో మలిచారు. శ్రీరామ తారక మంత్రాన్ని బాల్యంలోనే జపించడం ప్రారంభించిన ఆయన తనకు 38 ఏళ్ళు వచ్చేసరికి తొంభై ఆరు కోట్లు జపించారని చెబుతారు. అప్పుడే ఆయనకు శ్రీరామచంద్రుని సాక్షాత్కారం జరిగిందని ప్రతీతి. అలాగే మనం కూడా ఏదో ఒక భగవన్నామాన్ని తరచూ స్మరిస్తుండడం వల్ల తెలియకుండానే ఆ నామం మనకు అలవాటు అయ్యి మనల్ని తరించేట్లు చేస్తుంది.

శ్రీత్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం - తన జీవిత చరమదశను స్పష్టంగా చెప్పగల్గిన జ్ఞాని త్యాగరాజు. 1847 సంవత్సరంలో తన 80వ

ఏట... పుష్య శుద్ధ ఏకాదశి రాత్రి భోజనం చేసిన పిమ్మట తన శిష్యులను పిలిచి అదే నెలలో బహుళ పంచమి రోజున రమ్మని చెప్పి పంపించారు. ఆరోజు తెల్లవారుజామునే సంధ్యావందనము, జపము మొదలైన పనులన్నీ ముగించి ఆయన ఆపత్ సన్యాసాన్ని స్వీకరించారు. సన్యాసిగా మరణిస్తే పునర్జన్మ ఉండదనే నమ్మకము ఉండేది. శిష్యులంతా చేరేటప్పటికి ఆయన సన్యాసిగా ఉన్నారు. శ్రీరాముడికి కడసారి పూజ చేసి అందరిని రామ భజన చేయమన్నారు. ఆతర్వాత ఆయనలో ఒక వెలుగు బయటకు వచ్చి శ్రీరాముని విగ్రహంలో చేరిపోయింది. తిరువాయూరు క్షేత్రంలో త్యాగరాజస్వామి మహాసమాధి చెందిన పుష్య బహుళ పంచమి నాడు నేటికీ ఏటా ఘనంగా వారికి ఆరాధన ఉత్సవాలు జరుగుతాయి.

### పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**మే 2026**

**1 శుక్ర - (వైశాఖ) గురుపూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ.**

**12 మంగళ** - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురుపాదపూజ.

31 ఆది - అధిక జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ

**జూన్ 2026**

**10 బుధ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ**

**9 సోమ: నిజ జ్యేష్ఠ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ**

*నా ఎదురుగా గురువు, భగవంతుడు ఇద్దరూ నిలిచినచో ముందుగా గురువుకే పాదాభివందనం చేస్తాను. ఎందుకంటే, భగవంతుని దర్శించే మార్గము గురువే తెపిసారు. అందుకే భగవానుని కంటే నాకు గురువే ఎక్కువ*

- భక్త కబీర్‌దాస్

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

విచారాన్ని, దుఃఖాన్ని కలిగించే విషయాలు అయితే నీవు వాటి వెంట పడకుండా ఉండగలవేమో కాని, విషయాలు సంతోషం కలిగించేవి గానో, సుఖాన్ని ఇచ్చేవిగానో అనిపిస్తున్నప్పుడు మాత్రం నీవు వాటి వెంటపడి నీ లక్ష్యాన్ని విస్మరిస్తావు. అందుకే నీవు అలా చేయవద్దు. నీవు ఆ సంతోషానికి, విచారానికి వెనుక ఉన్న సత్యమేదైతే ఉన్నదో దానిని చూడు. అదే నీ లక్ష్యం. నీవు ఈ సంతోషాలకు, విచారాలకు, సుఖదుఃఖాలకు అన్నిటికీ అతీతుడవు కా. అలా అతీతుడవై, నీ లక్ష్యాన్ని సాధించు.



ఈ జగత్తు త్రిగుణమయం. ద్వంద్వమయం. ఈ త్రిగుణాలు, ఈ ద్వంద్వాలే నీ జన్మకు కారణం. ఈ విషయాలన్నీ ఎలా అనుక్షణమూ మారిపోతున్నాయో, అవి కల్పించే వికారాలు కూడా అలాగే అనుక్షణమూ మార్పు చెందుతున్నాయి. ఇవేవీ శాశ్వతమైనవి కావు. అందుచేత నీవు, నీకూ ఈ సకల జగత్తుకూ ఆధారమైన, నిత్యమైన సత్యవస్తువు ఏదైతే ఉన్నదో, ఆ పరబ్రహ్మమునే లక్ష్యంగా పెట్టుకో. నీ స్వధర్మాన్ని చక్కగా ఆచరించటం ద్వారా, నీ బుద్ధి వ్యవసాయాన్ని బ్రహ్మజ్ఞానార్జనకు అనువుగా మార్చు.

నీవు స్వధర్మాన్ని ఆచరిస్తున్నపుడు, కర్తృత్వ - భోక్తృత్వాభిమానాన్ని వదలి, ఇదంతా ఆ పరమాత్ముడి లీల, నేను కేవలం నిమిత్తమాత్రుణ్ణి అనే భావం స్థిరంగా నిలుపుకో. ఆ విధంగా చేస్తే, నీ మనస్సు ప్రసన్నం అవుతుంది. అటువంటి నిర్మలము, నిస్తరంగము అయిన మనస్సులో మాత్రమే నీవు భగవంతుణ్ణి దర్శించగలుగుతావు. సత్య స్వరూపుడైన ఆ పరమాత్ముని పాదాలను వదలకుండా పట్టుకో. నీకు ఎటువంటి అనుభవాలు ఎదురైనా సరే, వాటివలన ఎటువంటి భావాలు నీలో చెలరేగుతున్నా సరే, అవి నీలో ఎటువంటి సంచలనాలను, వికారాలను,

సృష్టిస్తున్నా సరే ఆ కనపడుతున్న దృశ్యాలూ, అనుభవాలూ, ఆ భావాలూ అన్నీ కేవలం నీ భ్రాంతి, కేవలం నీ మనోకల్పన అన్న నిజాన్ని నిశ్చయంగా తెలుసుకో. ఇవన్నీ ఆ సచ్చిదానందం యొక్క రూపనామాదులు మాత్రమే అన్న సత్యాన్ని నీవు నిశ్చయంగా నమ్ము. దానిని అన్ని కాలాలలోను గుర్తు పెట్టుకొని స్థైర్యంతో నిశ్చలంగా ఉండు. నీలో ఎటువంటి సంచలనం చేలరేగుతున్నా సరే, అది ఎటువంటి ప్రతిచర్యలను ప్రేరేపిస్తున్నా సరే, సత్యాన్ని తెలుసుకొని, నీవు మాత్రం భ్రాంతిలో పడక, ప్రశాంతగా వుండు. ప్రశాంతంగా ఉండటం అంటే, మంచినీ చెడునీ రెంటినీ సమదృష్టితో చూడటం.

ఈ జగత్తు అంతా త్రిగుణమయం. అంతేకాదు. ద్వంద్వమయం కూడా. విజ్ఞులు ఈ జగత్తులోని వస్తుజాలమంతా, మేఘాలు ఒక ఆకారంలో నుండి మరొక ఆకారంలోనికి, అలా వివిధ ఆకారాలలోకి మారుతూ రకరకాలైన బొమ్మలుగా ఎలా కనిపిస్తాయో, అదే విధంగా దృశ్యమానం అవుతున్నది అని తెలుసుకున్నారు. అందువలన వారు చెప్పింది గ్రహించి, కంటికి కనిపించే ఈ జగత్తు మిథ్య అని నిశ్చయపూర్వకంగా తెలుసుకొని, ఈ జగత్తుకంతటికీ ఆధారమైన ఆ పరబ్రహ్మములో నీ బుద్ధిని లయం చెయ్యి. అలా బుద్ధిని భగవంతునిలో చేర్చటాన్నే యోగం అంటారు. ఈ యోగాన్ని సాధించాలి అంటే, "ఇదంతా భగవంతుని లీల, నేను కేవలం నిమిత్తమాత్రణ్ణి" అనే భావంతో కర్మాచరణం చెయ్యాలి.

అసలు జగత్తు అంటేనే గతించేది అని అర్థం. మార్పుకు గురి అయ్యే, దృశ్యమానమయ్యే ఏ వస్తువు కూడ నిత్యమైన సత్యవస్తువు కావటానికి వీలులేదు. నీవు చూస్తున్నప్పుడు, చూడనప్పుడు, ఎప్పుడూ ఆకాశంలో మేఘం తప్ప పులి అనేది లేదు. అక్కడ పులిలాగ కనపడుతున్నది నీవు చూస్తున్న మేఘం యొక్క ఆకారమూ, ఆ ఆకారానికి ఉన్న పేరూ మాత్రమే.

ఈ విధంగా భ్రాంతి గొలిపే విషయాల పట్ల జాగ్రత్త వహించి వాటి అస్థిరత్వాన్ని, అశాశ్వతత్వాన్ని గుర్తించి, తెలివి తక్కువగా వాటి వెంట పరుగులు పెడుతున్న నీ మనస్సును వాటినుండి మరలించు.

- సశేషం

## శ్రీ మాతాజీవారి అమెరికా పర్యటన వివరములు

జూన్ 1, 2026 నుండి జులై 6, 2026 వరకు అమెరికాలోని వివిధ ప్రదేశములు పర్యటిస్తారు. ప్రతి సంవత్సరము అమెరికాలో జరుపబడే వార్షిక త్రయాహ్నిక దీక్ష , సత్సంగము జులై 2 నుండి 5 వరకు ఫోర్ట్‌మిల్ సౌత్ కెరలినాలో జరుగును. వివరములకు క్రింద ఇవ్వబడిన **QR code** ను స్కాన్ చేసుకొనవలెను. అమెరికా పర్యటన వివరములకు సంప్రదించవలసిన వారి పేరు,ఫోన్ నంబరు.

అమెరికా : శ్రీ తనకెళ్ళ కాళీప్రసాదు :
+1 (317) 459-2335,

**ఇండియా : శ్రీ మురళీ మోహన వర్మ :**
**093983 34345,**
**09393834345.**

https://mathaji-babuji.org/2026%20US...

## శ్రీ మాతాజీవారి యునైటెడ్ కింగ్‌డమ్ పర్యటన వివరములు

జులై 7, 2026 నుండి జులై 21, 2026 వరకు యునైటెడ్ కింగ్‌డమ్‌లోని వివిధ ప్రదేశములు పర్యటిస్తారు. ప్రతి సంవత్సరము యు.కె.లో జరుపబడే వార్షిక త్రయాహ్నిక దీక్ష, సత్సంగము జులై 10 నుండి 12 వరకు రీడింగ్‌లో జరుగును. వివరములకు క్రింద ఇవ్వబడిన **QR code** ను స్కాన్ చేసుకొనవలెను. పర్యటన వివరములకు సంప్రదించవలసిన వారి పేరు,ఫోన్ నంబరు.

యునైటెడ్ కింగ్‌డమ్ : శ్రీ తేజ గారు
0044-7805022588

**ఇండియా : శ్రీ మురళీ మోహన వర్మ :**
**093983 34345**
**09393834345**

https://mathaji-babuji.org/2026_SriMataj...

# స్వామి దయానంద మహారాజ్

(గత సంచిక తరువాయి) సేకరణ - మురళి

స్వామీజీ బుద్ధ గయకు కూడా వెళ్ళారు, పాళి భాష చదివారు. స్వామీజీ ఆత్మ ఆధ్యాత్మిక సూత్రజాలాల లోతైన అవగాహన, బౌద్ధ తత్వ శాస్త్రం గూర్చి పూర్తి అవగాహనం చూడగానే అక్కడి అధికారులు స్వామీజీని బౌద్ధ సంస్థల బాధ్యతలు తీసుకోవాలని, శ్రీలంక మరియు ఇతర ప్రాంతాలలో బౌద్ధమతంపై ఉపన్యాసాలు ఇవ్వాలని అభ్యర్థించారు. కానీ స్వామీజీ వినమ్రంగా తిరస్కరించారు. రాజస్తాన్‌లోని ప్రసిద్ధ నాథ్‌ద్వార మఠానికి చేరుకున్నారు. వంటపనిలో నియమించిన వ్యక్తి రాని కారణంగా మఠ నిర్వాహకులు స్వామిజీని ఒక సాధారణ వ్యక్తి అన్న భావనతో మఠ వంటగదిలో వాడిన పాత్రలు శుభ్రం చేయమని అడిగారు. స్వామిజీ ఆ పనిని నవ్వుతూ చేయడానికి వినయ పూర్వకంగా అంగీకరించారు.

ఆ రోజున మఠంలో హిందూ మతం ముఖ్యాంశాలపై గౌరవనీయుల సమావేశం జరిగింది. సభికులలో చర్చ జరుగుతుండగా, ప్రశ్న జవాబుల సమయంలో స్వామీజీ ఆకస్మాత్తుగా లేచి శుద్ధమైన, భావప్రధాన సంస్కృతంలో మాట్లాడారు: "ఈ చర్చలు, అడిగే ప్రశ్నలు సరైనవి కావు, వాస్తవాలపై ఆధారపడినవి కావు. అలాంటివి అయితే యథార్థమైన జవాబులు ఆశించడమే అసాధ్యం." సభాధిపతి కూడా సంస్కృతం మాట్లాడుతూ వివిధ విషయాలపై స్వామీజీతో చర్చలో దిగారు. స్వామిజీ యొక్క లోతైన ఉపన్యాసం, ఆధ్యాత్మిక స్వభావాల వివరణ ప్రేక్షకులందరినీ ఆకర్షించింది. సభాధిపతి స్వామీజీ పాదాలను తాకుతూ ఆయన ప్రతిభను గుర్తించక వంట గదిలో పాత్రలు శుభ్రం చేయమన్నందుకు క్షమాపణలు కోరారు. స్వామీజీ నేతృత్వంలో ఆధ్యాత్మిక మెలకువలు తెలుసుకోవాలని ఆశపడ్డారు. ఆ స్థానాధికారం స్వామీజీకి ఇవ్వాలని సిద్ధమయ్యారు. కానీ స్వామీజీ వినమ్రంగా తిరస్కరించి ముందుకు సాగిపోయారు.

తదుపరి స్వామిజీ కైలాశ్ ఆశ్రమానికి తిరిగి వచ్చారు. ఈ సమయంలో శాస్త్రాల లోతైన అధ్యయనం, యోగా, ఆధ్యాత్మిక జ్ఞానం, ఆత్మ దర్శనం యొక్క రహస్యాలను సాధింపజేసి మహామండలేశ్వర విష్ణుదేవానంద గిరిజీ యొక్క ప్రముఖ శిష్యుడిగా మారారు. స్వామి విష్ణుదేవానంద గిరిజీ స్వామీజీని తన వారసుడుగా గుర్తించి, కైలాశ్ ఆశ్రమ బాధ్యతలు అప్పగించాలనుకున్నారు. స్వామీజీ ఈ విషయాన్ని ముందుగానే ఊహించి, దేనికీ బంధం కాకూడదని ఒక రోజు ఎవరికీ చెప్పకుండా (ఇప్పటి ఉత్తరాఖండ్) ఉత్తరకాశీ ప్రాంతాల్లో సాధన కొనసాగించారు.

స్వామీజీ సమాధిలో ప్రవేశించి, బదరికాశ్రమం ముందు ఉన్న బీహాద్ గుహలో ఏడు నెలలు సాధన చేశారు. ఈ సమయలో స్వామీజీ తన సహచరుడు స్వామి

స్వయంభు తీర్థ్‌జీతో తన భావస్థితులను, దృష్టాంతాలను పంచుకున్నారు. "నేను స్వీయ సాక్షాత్కారం పొందాను. ఇక దేనికోసం ఆవేదన లేదు, మరింత సాధించాల్సినది లేదు. అంతా ఆధ్యాత్మిక ఆనందం, ప్రకాశం, శాంతి, తృప్తి విశ్రాంతి అన్నీ పరవశంగా వున్నాయి" అన్నారు. తన తిరుగు ప్రయాణంలో స్వామీజీ కైలాశ్ ఆశ్రమం సందర్శించి, స్వామి విష్ణుదేవానంద గిరిజీని కలిశారు. అక్కడ కొంత కాలం ఉండకుండా, పాదయాత్రతో యమునానగర్, అంబాలా, హిమాచల్ ప్రదేశ్‌లో చింతపర్ని వంటి పుణ్య ప్రదేశాలను దర్శించారు. భిక్ష ద్వారా స్వీకరించిన ఆహారంతో ఏ వ్యక్తికీ, ఏ ప్రదేశానికీ అనుబంధం లేకుండా జీవించేవారు. ఎల్లప్పుడూ పరమాత్మ అన్వేషణలో ఉండేవారు.

స్వామి దయానంద గిరిజీ పేరు, ప్రఖ్యాతి, ధనం లేదా పబ్లిసిటీ పట్ల విముఖత కలిగి ఉండేవారు. వేదాలు, ధర్మ గ్రంథాలు మరియు మానవ జీవన ఆధ్యాత్మిక కోణాలలోని రహస్యాలపై విస్తృతమైన జ్ఞానం ఉన్నప్పటికీ, స్వామిజీ తన అపార మానసిక సామర్థ్యాలపై ఏమాత్రం అహంకారం కలిగి ఉండేవారు కాదు. ఆయన్ను కలిసిన భక్తులకు బోధించేందుకు, వారిని జ్ఞాన మార్గంలో నడిపించటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారు. శారీరకంగానీ, ఆధ్యాత్మికంగానీ మానవ జీవితం లోని రహస్యాల గురించి స్వామిజీ తన జీవిత కాలంలో మూడు ప్రధాన వర్గాల వ్యక్తులతో పరిచయం కలిగి వున్నారు: - 1. మొదటి వర్గం సంతులు, సన్యాసులు, ఆధ్యాత్మిక గురువులు, మరియు ఆయన సహచరులు. వీరితో ఉన్న అనుబంధం ద్వారా ఆయన్ని వేదాలు, యోగా, తంత్ర విద్య, సాధన, సమాధి మొదలైన హిందూ ధర్మ విభాగాల్లో లోతైన అవగాహన కలిగి ఉండేలా చేసింది.

2. రెండవ వర్గం - ఆయన కుటుంబ సభ్యులు. వీరు తరచూ ఆయన్ను మళ్ళీ గృహస్థాశ్రమం వైపు మళ్ళించాలని కోరినా, స్వామిజీ పురాతన ఋషులు, మునుల మార్గాన్ని అనుసరించాలన్న తన నిశ్చయానికి ఎప్పటికీ కట్టుబడి వుండేవారు. చివరకు కుటుంబ సభ్యులు కూడా ఆయన్ను బలవంతం చేయకుండా, ఆయన సంకల్పాన్ని గౌరవించారు.

3. మూడవ, మరియు అత్యంత ముఖ్యమైన వర్గం - దేశమంతటా విస్తరించిన ఆయన వేలాది భక్తులు. వారిలో చాలామందికి స్వామిజీని ప్రత్యక్షంగా కలిసే అవకాశం రాకపోయినా, ఆయన ఉపన్యాసాలు, బోధనలు, రచనలు ద్వారా ఆయన్ని తెలుసుకున్నారు. ఆయన భక్తులు స్వయంగా ఆయన ప్రసంగాలను రికార్డు చేసి, పుస్తకాలుగా ప్రచురించి, దేశవ్యాప్తంగా మరియు విదేశాల్లో ఉచితంగా పంచిపెట్టి వేలాది మంది చదువరులకు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించారు.

- సశేషం

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి)

-పాలూరి ప్రసాద్

**131. ఓం వీత రాగాయ నమః**

శ్రీ గురుదేవులు రాగము నశించిన వారు. అనగా ఈ ప్రపంచములోని ఏ వస్తువుయందు వారికి అనురాగము, బంధము లేవు. వారికి ఉన్నది సర్వ జీవులయందు కేవలం అవ్యాజమైన ప్రేమేగానీ ఎవరియందు అనురాగము కానీ మమకారము కానీ లేవు. ఈ ప్రపంచములో కనుపించే వస్తువులు లేదా మనుష్యులు నాకు భిన్నంగా వున్నారని తలచే అజ్ఞానులకు కొందరియందు లేదా కొన్నిటియందు అనురాగము, మరి కొన్నిటియందు ద్వేషము కలుగుతాయి. కానీ ఈ ప్రపంచములోని సమస్త జీవరాశలయందు, వస్తువులయందు ప్రకాశించే పరమాత్మ ఒక్కడేనని, అదే తానని దృఢంగా తెలిసిన శ్రీగురుదేవుల వంటి వారికి అన్నిటియందు, అందరియందు అవ్యాజమైన ప్రేమే (తనను తాను ఎలా ప్రేమించుకుంటారో అలా) గాని రాగ ద్వేషాలు ఎలా కలుగుతాయి?

**132. ఓం మహా భోగాయ నమః**

శ్రీ గురుదేవుల భోగమును ఎవరు వర్ణించగలరు? త్రిమూర్తులకు శక్తినిచ్చి, ఈ జగత్తుకంతటికీ ఆధారభూతమైన అద్వైత సామ్రాజ్య చక్రవర్తి యొక్క భోగమునకు, ఐశ్వర్యమునకు కొదువేమున్నది? మనం అనుభవించే విషయ భోగాలు కొద్దిసేపు సుఖాన్ని ఇచ్చినట్లుగా భ్రమింపచేసి అంతులేని దుఃఖాన్ని మిగులుస్తాయి. కానీ శ్రీగురుదేవులు అనుభవించే ఆత్మానందము, ఆత్మ సుఖము, ఆత్మరతి నిత్యమైనవి. అందులో దుఃఖమునకు తావు లేదు.

**133. ఓం ధూతాశేష మనోవ్యధాయ నమః**

శ్రీగురుదేవులు తమ శిష్యుల యొక్క మనోవ్యధలన్నీ తొలగించి వేసి వారికి పరమ శాంతిని ప్రసాదించగల సమర్థులు. వారిని ఆశ్రయించి, వారిపై ప్రగాఢమైన చెక్కు చెదరని విశ్వాసముంచి, వారి ఆజ్ఞను తు.చ. తప్పక పాటించే శిష్యులకు ఏ రకమైన మనోవ్యధలు, మనోవికారాలు దరి చేరలేవు.

**134. ఓం సీతారామాంఘ్రి సంసేవా ప్రీతపూత మనోంబుజాయ నమః**

శ్రీగురుదేవులు స్వయంగా శ్రీ మారుతి అవతారులు. అందువలన శ్రీ సీతారాముల పాదపద్మ సేవ అనిన శ్రీగురుదేవులకు అమితమైన ప్రీతి. శ్రీ సీతారాముల యొక్క పాద పద్మాలకు తను, మన, ధనాలను అర్పించి నేను, నాది అనే భావన లేకుండా కేవలం ఆ దివ్య పాద పద్మాలయందు మనస్సును లగ్నం చేసి సేవించి, ఆసేవలోని ఆనందంతో నిండిపోయిన హృదయం కలవారు శ్రీగురుదేవులు.

**135. ఓం విశాల హృదయాయ నమః**

శ్రీ గురుదేవులు విశాల హృదయము కలవారు. మామూలు మానవులమైన మనము ఎల్లప్పుడు నా పొట్ట నిండాలి, నేను సుఖాలు అనుభవించాలి అని మాత్రమే ఆలోచిస్తాము. మనకు కొంత తృప్తి కలిగిన తరువాత మన భార్యా పిల్లలు, లేదా తల్లిదండ్రులు, లేదా దగ్గరి బంధువుల గురించి ఆలోచిస్తాము. వారికి సుఖాలను అందించటానికి ప్రయత్నిస్తాము. కొందరు విశాల హృదయులు తమ కుంటుంబాన్ని దాటి, తమ సమాజము, లేదా తమ గ్రామము, లేదా తమ దేశము గురించి ఆలోచించి వారికి మంచి చేయటానికి ప్రయత్నిస్తారు. కానీ శ్రీగురుదేవులు ఈ సమస్త చరాచర సృష్టిలోని సమస్త ప్రాణులను తమ కుటుంబంగా – కాదు కాదు – తమతో సమానంగా భావించి అందరికీ అన్నిటికీ సుఖ శాంతులను ప్రసాదిస్తారు.

**136. ఓం ప్రాజ్ఞాయ నమః**

శ్రీ గురుదేవులు అన్నీ తెలిసిన వారు. తమచేత నాన్నగారు అని పిలిపించుకున్న ఆత్మజ్ఞాన సంపన్నులైన శ్రీపరుశురామయ్య గారు వారికి అక్షరాభ్యాసము చేయ సంకల్పించినప్పుడు ఆ అక్షరములలో అక్షరస్వరూపిణి, సకల విద్యాధికారిణి, తత్త్వ స్వరూపిణియైన జగన్మాతను దర్శించి వేదస్వరూపులైనారు. అందువలన సకల వేదాలు, వేదాంగాలు, శాస్త్రాలు, సకల విద్యలు ఆయనను స్వతఃసిద్ధంగా ఆశ్రయించుకొని ఉన్నాయి.

**137. ఓం విజయాయ నమః**

శ్రీ గురుదేవులు కామ క్రోధాది అరిషడ్వర్గమును జయించినవారు. అంతేకాక ఎంతటి పండితులనైనను తమ అపార జ్ఞానంతో సమాధాన పరచి వారిని తమ మార్గంలోనికి తెచ్చుకొనగల సమర్థులు.

**138. ఓం విజయ ప్రదాయ నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన శిష్యకోటికి వారి సాధన మార్గములో ఆటంకములు ఏర్పరచే కామాది షడ్రిపులు, అహంకార మమకారములు, సంకల్పాలనే అంతః శత్రువులపై పోరాటానికి సహాయపడి, వారికి కర్తవ్య బోధ చేసి ముందుకు నడిపించి – ఆనాడు అర్జునునికి గీతాచార్యుడు శత్రువులపై విజయాన్ని ప్రసాదించినట్లుగా – విజయాన్ని ప్రసాదించే ఆచార్యదేవులు.

**139. ఓం త్రిజగద్వంద్యాయ నమః**

శ్రీగురుదేవులు ముల్లోకములకు వందనీయులు. ఈ ముల్లోకములను సృష్టించి, పెంచి, లయింపచేసే ఆ త్రిమూర్తులకు ఆధారభూతులై వారికి శక్తినిచ్చే శ్రీగురుదేవులు ముల్లోక వాసులకు వందనీయులే.


- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

**రుక్మిణీ, సత్యభామ -** వసుదేవుని భవనం నుండి బయటకు వచ్చి అర్జునుడు కృష్ణుడి అంతఃపురాన్ని చేరుకొనే సరికి రాత్రి బాగా పొద్దుపోయింది. అంతటా చీకటి ఆవరించి ఉన్నది. అక్కడక్కడా మిణుకు మిణుకు మంటూ సన్నగా వెలుగుతున్న దీపాలు. గాలికి రెపరెప లాడుతున్న దివిటీల కాంతిలో ద్వారక సుదీర్ఘమైన నీడ గుబులు గుబులుగా భయం గొలిపేదిగా ఉన్నది. అంతఃపుర ద్వారం దగ్గర దివిటీలు వెలుగు తున్నాయి. అర్జునుడిని చూసి ఆ దివిటీల మధ్య నుంచుని ఉన్న ద్వారపాలకులు శిరసస్సు వంచి అభివాదం చేశారు. అర్జునుడు లోపలికి ప్రవేశించాడు.



ఈ అంతఃపురంలోని ప్రతి అణువూ అర్జునుడికి చిరపరిచితమే. ఈ సత్యభామ, రుక్మిణీల అంతఃపురాలకు అర్జునుడు ఇంతకు పూర్వం ఎన్నోసార్లు వచ్చాడు. కాని ఈనాటి తన రాక... ఈ అంతఃపురం... అంతా ఏదో క్రొత్తగా విలక్షణంగా ఉన్నట్లు అనిపిస్తున్నది. ఉద్యానవనం పాడుపడి కళావిహీనంగా ఉన్నది... ఎన్నాళ్ల నుండో ఉద్యానవనంలో నీళ్ళు పోసినట్లు లేదు. అక్కడక్కడ ఎండుటాకులు దూరంగాపడి దారి కనిపిస్తున్నది. అంతేకాని అక్కడ ఎవ్వరూ ఉద్యానవనం శుభ్రం చేస్తున్న జాడ లేదు.

అంతఃపురం మెట్టు మీద పాదంమోపబోతూ ఆగాడు అర్జునుడు. ఈ మెట్లు, ఎక్కటం ఎంత కష్టంగా ఉంది? ఎలా ఎక్కటం అనిపిస్తున్నది. కిరాతుని రూపంలో ఉన్న శివునితో యుద్ధం చేసినప్పుడు, హిమాలయాల లోని దుర్గమ పర్వత శిఖరాలను అధిరోహించినప్పుడు కూడ తనకు అంత కష్టం అనిపించలేదు. కాని ఈ మెట్లు ఆ హిమాలయ శిఖరాల కంటే ఎంతో ఎత్తుగానూ, దుర్గమంగానూ అనిపిస్తున్నాయి. అయినా, అక్కడ ఎంతసేపు నుంచోగలడు.... అర్జునుడు మనస్సును

దిటవు చేసికొని శక్తిని అంతా కూడగట్టుకొని అడుగులు వేస్తూ మెట్లు ఎక్కసాగాడు. లోపల వెలుగైతే ఉన్నది కానీ గుడ్డి వెలుగు. ఆ కాంతిలో ఏమీ కనిపించటం లేదు. లోపల ఒక స్తంభానికి ఆనుకొని నిల్చొని వున్న ఆ ఇద్దరు రాణులు కూడా ఆ చీకటిలో కలిసిపోయి అర్జునునికి కనిపించటం లేదు. మెట్లు ఎక్కుతున్న అర్జునుడిని ఆ ఇద్దరు రాణులు చూశారు. అర్జునుడి ముఖంలో కొట్టవస్తున్న విషాద రేఖలు వాళ్లకు కనిపించాయి. అంతే! అర్జునుడు అనుభవిస్తున్న ఆ వ్యథకు వారి హృదయాలు కరిగి నీరైనాయి. వారి కనుల నుండి అశ్రుధారలు ప్రవహించాయి.

"వచ్చావా ధనంజయా! నువ్వు వచ్చినట్లు దారుకుడు చెప్పాడు. అప్పటి నుంచి నీ కొరకు ఎదురు చూస్తున్నాము" అని రుక్మిణి ముందుకు వచ్చి అర్జునుడితో అన్నది. 'అమ్మా! అర్జునుడు ప్రణమిల్లుతున్నాడు' అని అర్జునుడు ప్రణమిల్లాడు. అర్జునుడు ముందు రుక్మిణికి తరువాత సత్యభామకి ప్రణామం చేశాడు.

'యశస్వీ భవ!' అని రుక్మిణి ఆశీర్వదించింది. 'ఇదేమి ఆశీర్వాదం తల్లీ! యశస్సు పొందేందుకు ఇంకా ఈ ధనంజయుడికి ఏం మిగిలింది? కృష్ణుడు లేనిచోట యశము ఎక్కడ లభిస్తుంది?" అన్నాడు అర్జునుడు.

"నిజమే ధనంజయా! కృష్ణుడు లేనిచోట యశము ఎక్కడిది? ఇదేదో కేవలం యాదవ కులానికే కాదు. ఆర్యావర్తానికంతటికి గ్రహణం పట్టుకొన్నది. ఇది ఎవరి పాపానికి శిక్షయో?" రుక్మిణి దుఃఖంతో వివశురాలైంది.

"అక్కా!" సత్యాదేవి రుక్మిణి కన్నీరు తుడిచి ఆమెను ఊరడిస్తూ అన్నది. "నేనే...నేనే.. స్వామిని బాధ పెట్టాను.... అవునక్కా! అపరాధిని నేనే! కానీ, స్వామి ఏం చేశాడో చూడు! నా పాపానికి శిక్ష ఈ ద్వారక కంతటికీ వేశాడు... నా స్వామి ఎందుకలా చేశాడు?"

"ఇదేమిటి... మీరు ఏమంటున్నారు సత్యాదేవీ?" అంటూ అర్జునుడు అయోమయంలో పడ్డాడు. "మీరు.... మీరా కృష్ణుడి పట్ల అపరాధం చేసింది... ఇదెలా సంభవం?"


- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 60: శాంతి రూపాత్ పరమానంద రూపాచ్చ**

తాత్పర్యము: భక్తి శాంతి రూపము మరియు పరమానంద రూపమును కలిగినది. శాంతి అంటే అల్లకల్లోలం లేని నిర్మలమైన మనస్సును కలిగి వుండడం. అది పరమాత్మ లక్షణము. పరమానందము కూడా సచ్చిదానంద రూపమే. మరి అటువంటి భగవంతుని చేర్చే భక్తిది కూడా అదే రూపమవడంలో సందేహం లేదు. ఎందుకంటే భక్తి వున్న చోట శాంతి ఉంటుంది; శాంతి వున్న చోట పరమానందం సహజంగా వస్తుంది. ఈ సూత్రం భక్తి యొక్క పరమ స్వరూపాన్ని అత్యంత సారాంశంగా, లోతైన తాత్త్వికతతో తెలియజేస్తుంది. ఇక్కడ "శాంతి" అనగా కేవలం బయట కనిపించే నిశ్శబ్దం కాదు; అది మనస్సులోని చంచలత పూర్తిగా తగ్గి, ఆలోచనల అలజడి సమసిపోయి, అంతరంగంలో ఒక స్థిరమైన ప్రశాంతత ఏర్పడే స్థితి. "పరమానందం" అనగా సాధారణ సుఖానికంటే భిన్నమై, కాలానుగుణంగా మారిపోని, బాహ్య పరిస్థితులపై ఆధారపడని, ఆత్మస్వరూపంలో నుంచే ఉద్భవించే శాశ్వత ఆనందం. "రూపాత్" అనే పదం ద్వారా నారదులు శాంతి, పరమానందం భక్తియొక్క సహజ స్వరూపాలనీ బయటి నుండి వచ్చే ఫలితాలు కావనీ తెలియజేస్తున్నారు.



సాధన ప్రారంభ దశలో మనస్సు అనేక వికారాలతో, ఆశలు, భయాలు, ఆందోళనలతో నిండి ఉంటుంది. కానీ భగవంతునిపై నమ్మకం పెరిగే కొద్దీ, భక్తుడు తన జీవితంలో జరిగే ప్రతి విషయాన్ని దైవ ప్రసాదముగానే అంగీకరించడం ప్రారంభిస్తాడు. అనుకూలమా, ప్రతికూలమా అనే విచారం తగ్గి, "ఇది కూడా ఆయన కృపలో భాగమే" అనే దృక్పథం ఏర్పడుతుంది. ఈ దృక్పథమే మనస్సులోని ప్రతిఘటనను తగ్గించి, అంతరంగంలో గాఢమైన శాంతిని కలిగిస్తుంది. ఈ శాంతి బాహ్య పరిస్థితుల వల్ల కదిలిపోక కష్టకాలంలో కూడా నిలకడగా ఉంటుంది. అందుకే భక్తిది "శాంతి రూప"మని నారదులు నిర్వచించారు.

శ్రీ బాబూజీ మహారాజ్ వారు అందించిన "సత్యం – శాంతి – దయ – ప్రేమ" అన్న మహామంత్రములోని "శాంతి" కూడా దీనినే సూచిస్తుంది. ఈ శాంతి స్థితి లోతుగా స్థిరపడినప్పుడు, భక్తి మరింత గాఢమైన అనుభూతిగా మారుతుంది. సాధకుడు

భగవంతుని స్మరణలో ఆనందాన్ని అనుభవించడం ప్రారంభిస్తాడు. ఇది సాధారణంగా ఇంద్రియాల ద్వారా వచ్చే ఆనందం కాదు; అది అంతర్గతంగా ఉద్భవించే ఆనంద ప్రవాహం. భక్తుడు ఏ పని చేసినా, ఏ స్థితిలో ఉన్నా, ఆ అంతరంగ తృప్తి, ప్రసన్నత, నిండుదనం అనుభవిస్తాడు. ఇది లాభనష్టాలకు, జయాపజయాలకు, ప్రశంశ అప్రతిష్ఠలకు అతీతమైన ఆనందం. అదే "పరమానందం".

ఈ స్థితికి ముఖ్యమైన కారణం అహంకార క్షయం. సాధారణంగా దుఃఖానికి మూలకారణమైన "నేను" "నాది" అనే భావన తగ్గి "అన్నీ నీ ప్రసాదమే" అనే భావన ఆరూఢమవుతుంది. ఈ అనుభూతిలో ద్వైత భావం తగ్గి, భగవంతునితో ఒక సాన్నిహిత్యం, ఏకత్వ భావం ఏర్పడుతుంది. ఈ ఏకత్వానుభూతి నుంచే పరమానందం ఉద్భవిస్తుంది.

భగవద్గీత కూడా ఇదే భావనను ప్రతిధ్వనిస్తూ "**బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి**" --- అంటూ ఈ స్థితిలో ఉన్న సాధకుడు దుఃఖించడు, కోరికలు పెట్టుకోడు – సహజంగా శాంతితో, ఆనందంతో నిండిపోతాడని తెలిపింది. ఇది భక్తి యొక్క పరిపక్వ స్థితి. మనస్సును ప్రశాంతంగా మార్చి, హృదయాన్ని పరమానందంతో నింపే అంతరంగ పరివర్తనయే భక్తి. భక్తి ద్వారా మనిషి బాహ్యానందము నుండి అంతర్గత ఆనందము లోనికి ప్రయాణం చేస్తాడు. ఈ ప్రయాణంలో మొదట శాంతి లభిస్తుంది; ఆ శాంతి లోతుగా మారినప్పుడు పరమానందంగా వికసిస్తుంది. చివరకు ఆ భక్తి మనిషిని దుఃఖానికి అతీతమైన, శాశ్వత ఆనందమయమైన దివ్య స్థితికి చేర్చుతుందని ఈ సూత్రము ద్వారా నారదులు తెలియజేస్తున్నారు.

**భక్తి సూత్రము 61: లోకహానౌ చింతా న కార్యా నివేదితాత్మలోకవేదత్వాత్**

తాత్పర్యము: భక్తుడు తనను, తన కర్మలను అన్నింటినీ భగవంతునికి సమర్పించిన వాడైనందు వల్ల లోక హాని గురించి ఎప్పుడూ తలపెట్టకూడదు. ఈ సూత్రము ద్వారా నారదులు భక్తి యొక్క పరిపక్వ స్థితిని వివరిస్తున్నారు. సాధారణంగా మనిషి తనను, తన కుటుంబాన్ని, తన సంపదను "నా" అనే భావంతో గట్టిగా పట్టుకొని జీవిస్తాడు. "నాది" అనే భావమే అహంకారానికి దారి తీసి ఏదైనా కష్టమొచ్చినపుడు తీవ్ర చింతకు, బాధకు మూలం అవుతుంది. ఏదైనా కోల్పోయినప్పుడు "నేను కోల్పోయాను" అని భావించి లోపల కుంగిపోతాడు.

కానీ నిజమైన భక్తుని దృక్పథం పూర్తిగా భిన్నంగా ఉంటుంది. అతను తనను తాను మాత్రమే కాదు, తనకు సంబంధించిన ప్రతి విషయాన్ని --- తన శరీరం, మనస్సు, కుటుంబం, సంపద, కీర్తి, కర్మలు --- అన్నింటినీ భగవంతునికి సమర్పించినవాడిగా

భావిస్తాడు. ఈ స్థితినే "నివేదితాత్మ" అంటారు. ఇక్కడ "ఆత్మ" అనగా కేవలం శరీరం కాదు; తన సంపూర్ణ జీవితమే. తనకు సంబంధించిన బాహ్య ప్రపంచం, కర్తవ్యాలు, ధర్మాలు, కర్మలు అన్నీ కూడా భగవంతునికి అర్పించబడినవే అని అటువంటి భక్తుడు భావిస్తాడు. ఈ సమర్పణ భావం వచ్చిన తర్వాత "నాది" అనే భావం క్రమంగా తరిగిపోయి దాని స్థానంలో "అన్నీ ఆయనవే" అనే స్పష్టమైన అనుభూతి ఏర్పడుతుంది. అప్పుడు లోకంలో ఏదైనా కష్టం కలిగినా దానిని "నష్టం"గా భావించక భగవంతుని నిర్ణయముగా స్వీకరించగలుగుతాడు.

ఈ దృక్పథం వల్ల అతనిలో చింతకు స్థానం ఉండదు. అతను బాధను నిరాకరించడు, కానీ దానిలో చిక్కుకోడు. ఆ సాధకుడి మనస్సు వెంటనే భగవంతుని వైపు తిరిగి, శాంతిని పొందుతుంది. ఇది నిర్లక్ష్యమో లేక బాధ్యతారాహిత్యమో కాదు. భక్తుడు తన కర్తవ్యాలను శ్రద్ధగా చేస్తాడు, కానీ ఫలితాలపై అధిక ఆసక్తి పెట్టడు. ఎందుకంటే ఫలితాలు తనవని అతను భావించడు. ఈ భావన అతనికి ఒక అంతరంగ స్వేచ్ఛను ఇస్తుంది. భయాలు తగ్గిపోతాయి, ఆందోళనలు కరిగిపోతాయి, జీవితంపై ఒక విశ్వాసం ఏర్పడుతుంది. మరి అటువంటి వాడు లోక హాని గురించి ఏనాడూ ఆలోచించడు.

నిజానికి అటువంటి స్థితిలో వున్న వారికి లోకం కూడా భిన్నంగా కనబడదు. తనతో అభిన్నంగా వున్న లోకానికి హాని ఏవిధంగా తలపెట్టగలరు? ఈ అంశమునే నారదులు "**లోకహానౌ చింతా న కార్యా**" అని వివరించారు. ఈ సూత్రం మనకు చెప్పే గొప్ప సత్యం ఏమిటంటే --- చింతకు మూలం "అహంకారం" మరియు "మమకారం". సమర్పణకు మూలం "భక్తి". భక్తి పెరిగిన కొద్దీ అహంకారం తగ్గిపోతుంది; అహంకారం తగ్గిన కొద్దీ చింత కూడా దానంతట అదే స్వయంగా తగ్గిపోతుంది.

అందువల్ల ఈ సూత్రం మనకు జీవితంలో జరిగే ప్రతి విషయాన్ని భగవంతునికి అర్పిస్తూ జీవించడం అనే ఆచరణాత్మక మార్గాన్ని చూపిస్తుంది. అప్పుడు నష్టాలు వచ్చినా మనస్సు కదలదు; ఎందుకంటే భక్తుని అసలైన ఆధారం భగవంతుడే తప్ప లోక విషయాదులు కాదు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**మే 2026**

1 శుక్ర - (వైశాఖ) గురు పూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

4 సోమ వైశాఖ బహుళ తదియ - ఆశ్రమ స్థాపిత 54వ వార్షికోత్సవం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

6 బుధ - వైశాఖ బహుళ పంచమి - శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారల ప్రతిష్ఠా వార్షికోత్సవము, రాత్రి 7గం. సామూహిక లీలా కళ్యాణ మహోత్సవము.

12 మంగళ - శ్రీగురుదశమి, శ్రీ హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

15 శుక్ర - మాస శివరాత్రి

16 శని - అమావాస్య

31 ఆది - 54 వ ఆశ్రమ వ్యవస్థాపక దినోత్సవము, అధిక జ్యేష్ఠ పూర్ణిమ, శ్రీ సద్గురుపాదపూజ.

**జూన్ 2026**

**10 బుధ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.**

**13 శని: మాసశివరాత్రి, శనిత్రయోదశి**

**15 సోమ: అమావాస్య**

**16 మంగళ: జ్యేష్ఠ శుద్ధ విదియ – పావులూరు శాఖ వార్షిక సత్సంగ సమావేశములు. శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామి వారి ఆరాధన, హారతి.**

**23 మంగళ: జ్యేష్ఠ శుద్ధ నవమి – శ్రీ సుగుణ ప్రసాద మాతాజీవారి ఏకోనవింశతి(19) వార్షికారాధన. సత్సంగం.**

**27 శని: శనిత్రయోదశి**

**29 సోమ: నిజ జ్యేష్ఠ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ.**

# అడిగినప్పుడు టిక్కెట్ చూపవలెను

- పెనుమాక నాగేశ్వర రావు

టిక్కెట్ లేని ప్రయాణం నేరం అని మనందరికీ తెలిసిన విషయమే. అలాగే సినిమాలకి వెళ్ళినప్పుడూ, బస్సుల్లోనో, రైళ్ళల్లోనో, విమానాల్లోనో, పడవల్లోనో ప్రయాణం చేసేటప్పుడు కూడా టిక్కెట్ తప్పనిసరి. కొన్నికొన్ని హోటళ్ళల్లో కూడా మనం ఆహారం తినకముందే టిక్కెట్ తీసుకోవాలి. అయితే వీటిని టోకెన్ అంటుంటారు వాడుక భాషలో.

ప్రయాణాల్లో తీసుకునే టిక్కెట్లకి రకరకాలు ఉంటాయి కదా. ఫస్ట్, సెకండ్, థర్డ్, స్లీపర్ అని రైళ్లల్లోనూ, ఆర్డినరీ, ఎక్స్ప్రెస్, డీలక్స్ వగైరాలు బస్సుల్లోనూ, ఇక ఏ.సీ. నాన్ ఏ.సీ  వుండనే వున్నాయనుకోండి. అలా పిండికొద్దీ రొట్టె అనో, ఎంత చెట్టుకు అంతా గాలనో సరిపుచ్చుకోవడం, సర్దిచెప్పుకోవడం మనకి తెలిసిందే.

అవన్నీ ఒక ఎత్తయితే, దేవుడికి కొబ్బరికాయ కొట్టడానికి, పూజ చేయడానికి, చివరికి దర్శనానికి కూడా (ఉచిత దర్శనం వున్నా) టిక్కెట్ తీసుకోవాలి. అయితే ఇందులో కూడా మళ్ళీ శ్రేణులు ఏర్పాటుచేశారు. శీఘ్ర దర్శనం, అంతరాలయ దర్శనం, ప్రత్యేక దర్శనం,  వి.ఐ.పి. దర్శనం ఇలా అనేక రకాలు.

అలాగే మనం పుడుతూనే ఓ టోకెన్‌తో పుడతాం అనుకుంటే – అదే మన తల రాత అంటుంటారుగదా! ఎంతని పడుతుంది నుదుటన! మహా అయితే ఓ పది లైన్లు, పదిహేను లైన్లు. అంతకన్నా చోటు వుండదుగా నుదురు మీద. అందుకే మన ముఖాన వుండే టోకెన్ బట్టి మన జీవితచరిత్ర, కర్మఫలాలు, పాపాలు, పుణ్యాలు పూర్వజన్మలు, రాబోయే జన్మలు వగైరాలన్నీ ఆ టోకెన్ రంగును బట్టో, పరిమాణాన్ని బట్టో తెలిసిపోతుందని ఊహించుకుందాం.

ఎవరికి తెలుస్తుంది అంటే మహాత్ములకి. మహాపురుషులకు. ఒక్క పరమాత్మకు తప్ప, మనకి పరమ ఆప్తులయిన వారు అనుకునే వారిక్కూడా తెలీదు మనం ఎవరమో! మనం ఏమిటో. మన ముఖం, మనకెలా తెలుస్తుంది!

చిలుక జోస్యం చెప్పే వ్యక్తి చిలుక చేత ఓ కార్డ్ తీయిస్తాడు. ఆ కార్డ్ సైజ్ చిన్నగా ఉండేది. అయితే మనం పుట్టినప్పటి నుంచి పడిన కష్టాలు, మన వ్యక్తిత్వం, కోరికలు, అవమానాలు, మన సంసారం, ఒకటేమిటి మన ఆయుష్షు, ఐశ్వర్యం, సంతానం, పెళ్ళి, పిల్లలు. ఇలా సమస్తం చెప్పేస్తాడు జోస్యం చెప్పే వ్యక్తి. ఇదంతా ఆ కార్డులో వ్రాసి ఉంటుందా? అది చూడంగానే అంతా తనకి తెలిసిపోయిన విధంగా అతడు చెబుతాడు, మనం వింటాం.

అలాగే ఇప్పుడు మనం చెప్పుకుంటున్న టోకెన్ కూడా అని నా ఉద్దేశ్యం. అలా చెప్పుకుంటే మనకి బాగా అర్థం అవుతుంది. ఇచ్చిన టోకెన్ ఇవ్వకుండా ఒక్కో జీవికి ఒక్కోరకం టోకెన్ ఇచ్చి భూమి మీదకి పంపటమే ఓ అద్భుతం. ఆ టోకెన్లు ఎవరివి వారికి కనబడవు, ఎదుటివారికీ కనబడవు. అవి కనపడేది భగవంతుడికి ఒక్కడికే అనుకున్నాం కదా. మనం వచ్చేటప్పుడు తెచ్చుకున్న టిక్కెట్ లేదా టోకెన్ వెళ్ళేటప్పుడు కూడా అలాగే వుందా, తేలికయిందా, బరువైపోయిందా అని తెలుసుకోగలిగినది ఒక్క గురుమూర్తే ! ఆయన మన టిక్కెట్ అడగరు. అడగాల్సిన అవసరం లేదు. కాబట్టి మన టిక్కెట్ ఎవరికీ చూపనవసరం లేదు. మనం దిగాల్సిన చోటు చేరేదాకానే మన దగ్గర ఉన్న టికెట్‌కు విలువ ఉంటుంది. మన ప్రయాణం ముగిశాక ఆ టికెట్ ఒక చిత్తు కాగితమే. అలాగే ప్రదర్శన అయిపోయాక, సినిమా టికెట్‌కు కూడా విలువ ఉండదు. జేబులో నుంచి తీసి అవతల పారేస్తాం. వేలు పెట్టి కొనుక్కున్న విమానం టికెట్ కూడా అంతే. దాని విలువ, అవసరం, ప్రాధాన్యత అంతవరకే పరిమితం.

అయితే ఇప్పటివరకు చెప్పుకున్న భగవంతుడు ఇచ్చిన టికెట్ (విధివ్రాత) విషయంలో మన ప్రయాణమో, ప్రదర్శనో పూర్తయ్యాకనే దాని ప్రాముఖ్యత ప్రారంభం అవుతుంది. మానవత్వం, మాధవత్వం, దానవత్వం. ఈ మూడింటి మిశ్రమమే మానవుడు. మనలోని మానవత్వాన్ని పెంచుకుంటూ, దానవత్వాన్ని తగ్గించుకుంటూ, మాధవత్వం వైపు ప్రయాణం చేసి ఎంతో కొంత మేరకు దేవుడు మెచ్చే మనిషిలా మారడమే మానవ జన్మకు సార్ధకత అని మహాత్ములు చెబుతున్నారు కదా.

అలా పుడుతూ తెచ్చుకున్న టికెట్ వెళ్ళేటప్పుడు ఎలా మారింది, ఎంతగా మారింది, ఎందువల్ల మారింది, ఏం చేస్తే మారింది అనేదే మన ప్రయాణం. ప్రాణ ప్రయాణం. ఈ ప్రయాణం సజావుగా సాగడానికి సద్గురు దేవుల కృప ఒక్కటే ఆధారం. ఈ ఆధార్ కార్డ్ సంపాదించుకో గలిగితే మన ప్రయాణం రాయితీలతో పాటు రాజమార్గం కూడా పొందవచ్చనే నమ్మకంతో ప్రయాణిద్దాం. జై సద్గురు మహరాజ్ కీ జై

*భగవన్నామమనెడి దివ్యమణి దీపాన్ని నాలుక అనే గడప మీద వుంచినచో దేహమనే ఇంటిలోపల, బయట కూడా వెలుగుల వెల్లువ వెల్లివిరుస్తుంది. అప్పుడు సర్వత్రా మోక్షదాయకమే!*

- శ్రీ తులసీదాస్

# మాయా విలాసం

-వేలమూరి రవికుమార్

శ్రీ గురుదేవుల కృపాకటాక్షము వలన మనం ముఖే ముఖే సరస్వతి అను వాక్యము యదార్థమగునట్లు అనేక మంది పెద్దలు, విజ్ఞులు, సాధకుల ద్వారా అనేక ఆధ్యాత్మిక, లౌకిక విషయాలు తెలుసుకుంటున్నాము. తామే పరబ్రహ్మమై వుండి, తాము నిరంతరము ఎటువంటి ఆనంద స్థితిలో వున్నారో, అంతటి స్థితిని తమ భక్తులైన మనమందరమూ పొందాలని అహర్నిశలు మనకై పరితపిస్తున్న శ్రీ గురుదేవులకు నా హృదయపూర్వక సాష్టాంగ నమస్కారములు.

శ్రీ గురుదేవులు 'గురు' అనే పదమునకు ఆది మరియు అంతము లేనిది అనే అర్థమని మనకు ఎన్నోసార్లు వివరించారు. ఇది సత్యమని మనందరకూ తెలుసు. అయినా మాయా సంకల్పము వలన సాధకులకు అప్పుడప్పుడు అహం బయలుదేరి మన ఆధ్యాత్మిక ప్రగతికి అవరోధంగా మారుతోంది. ఈ మాయ గురించి రకరకాలుగా అర్థం చెప్పవచ్చు. అన్నిటికి మూలం మనస్సు. మనస్సుకు మాయకు సంబంధం ఏమిటంటారా! మాయయే మనస్సు యొక్క పలు రూపములు (కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం, ఈర్ష్య, అసూయ, అసహనం, ఓర్వలేనితనం మొదలైనవి) దాల్చి, మనము సత్యమైన పరబ్రహ్మము అనే ఎఱుకను మరుగున పడవేస్తుంది. ఈ మాయను గురించి సత్య హరిశ్చంద్రులవారు **మాయామేయ జగంబె నిత్యమని సంభావించి, మోహంబునన్** – అని తాను పొందిన అనుభవాన్ని తెలియజేశారు. అంటే ఈ కనబడుతున్న జగమంతా మన మనస్సు కలిగిస్తున్న మోహ భ్రాంతి వలన సత్యము, నిత్యము అని భ్రమపడతుంటాము.

కానీ, ఈ జగత్తు నిజమా అంటే శ్రీగురుదేవులు రజ్జు, సర్ప భ్రాంతి గురించి ఎప్పుడూ చెబుతూ వుండేవారు. చీకటిలో వున్న త్రాడును చూసి పాము అని అనవసరమైన భయ భ్రాంతులకు గురవుతుంటాము. ఆందోళన చెందుతాము. మన గురుభక్తుల అదృష్టమేమిటంటే అది త్రాడురా, పాము కాదు అని వెలుగులో చూపించి, మన ఆందోళనను తొలగించే శ్రీగురుదేవుల అనుగ్రహం మనపై కలగడమే! ఎప్పుడైతే భ్రమ తొలగుతుందో, సత్యం నిరూపణ అవుతుంది. సత్య నిరూపణ అయితే మనకు ఈ జనన మరణ భయం కూడా తొలగిపోతుంది.

ఇప్పుడు మనస్సు విషయానికి వద్దాం. మనస్సుని ఎవరైనా చూశారా? లేదు. కాని ప్రతి ఒక్కరూ మనస్సుని గురించి ప్రస్తావిస్తూ వుంటారు. ఈ మనస్సును గురించి యోగవాశిష్ఠంలో వశిష్ఠులవారు చక్కగా వివరించారు. మనస్సు ఎన్నో జన్మల నుంచి

వస్తున్న విషయ వాసనల కరుడుగట్టిన గడ్డ – అని తెలిపారు. మరి మనస్సు వున్నంత సేపూ మాయ సహజం. మరి మనస్సు లేకుండా చేయాలంటే, మనస్సు యొక్క ప్రభావం మన మీద లేకుండా చేయాలి అంటే మనం ఈ కరుడుగట్టిన గడ్డను అనగా విషయ వాసనల ముద్దను కరిగించాలి. దానికి మనం ఏం చేయాలి? దానికి శ్రీబాబు '**ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి**' అని మనపై కరుణతో సమాధానం చెప్పారు. శ్రీగురుదేవులు మనకు ప్రసాదించిన లక్ష్యార్థాన్ని నిరంతర సాధన చేయగా. చేయగా ఆ కరుడు కట్టిన గడ్డ కరిగిపోయి శ్రీ గురుదేవులు ఏదైతే మనం పొందాలని కాంక్షించారో ఆ ఆత్మానందాన్ని పొందగలము. కనుక గురు లక్ష్యార్థం మనకు అమృతమై, జనన మరణ భయాలను పోగొట్టి ఆత్మానందాన్ని కలుగజేస్తుంది.

ఇక్కడ మనకు శ్రీ గురుదేవులు ప్రసాదించిన లక్ష్యార్థ సాధనలో రెండు విషయాలు మిళితమై వున్నాయి. 1. మంత్రానుష్ఠానము, 2. సత్యాసత్య విచారణ. మొదటిది భగవంతుని యందు విశ్వాసము, ప్రేమని పెంచడం చేస్తే, రెండవది విశ్వం యొక్క రహస్యాన్ని తెలియజేసి మరు జన్మ లేకుండా చేసి సుఖదుఃఖాలకు అతీతుడవై జీవించడం నేర్పుతుంది.

శ్రీబాబు విచారణ గురించి తెలియజేస్తూ, ఉల్లిపాయ పొరలను ఉపమానంగా చెప్పేవారు. ఒకడు గురువుగారి దగ్గరకు వెళ్ళి మీరు విచారణ చేయమంటున్నారు అది ఎలా చేయాలి? అని అడిగితే, గురువుగారు నాయనా! ఒక ఉల్లిపాయ తీసుకువచ్చి, పొరలు పొరలుగా ఒలవమన్నారు. అతడు అలా చేసి మళ్ళా గురువుగారి వద్దకు వెళ్ళి, స్వామీ! మీరు చెప్పినట్లే చేసాను. కానీ దాని అంతరార్థం నాకు బోధపడలేదు అని చెప్పాడు. అప్పుడు గురువుగారు దయతో వానికి ఇట్లా తెలియజేశారు 'నీలో వుండే అనేక భావనలు ఉల్లిపాయ పొరల వంటివి. ఆ ఉల్లిపాయ పొరలను ఒలవగా ఏమి మిగిలింది? అని అడిగితే ఆ శిష్యుడు ఏమీలేదని సమాధానం చెప్పాడు. అప్పుడు గురువుగారు నీ మనస్సులోని అనేక భావాలనే ఉల్లిపాయ పొరలను తొలగించుకుంటూ పోతే నిత్యము, సత్యమైన 'నేను' నువ్వని గ్రహించగలవు. ఆ నేను శరీరము కాదు, ఆత్మ అని ప్రబోధన చేసి శిష్యునికి జ్ఞాన ప్రకాశాన్ని కలుగజేశారు. కనుక మనం మన సాధనచేత మనస్సు కలిగించు అనేక భావనా పొరలను తొలగించుకుంటూ, అవసరమైన చోట శ్రీగురు బోధామృతాన్ని నెమరువేస్తూ ఆత్మానందాన్ని పొంది శాశ్వతమైన జీవన్ముక్తిని పొందగలము. ఇది మన జీవన పరమావధి అని ఎప్పుడూ మరచిపోరాదు.

- సశేషం

# దైవాధీనం భిక్షామ్ దేహి

-భాగవతుల హనుమత్ జయప్రద

ఒక ఊరిలో ఇద్దరు భిక్షగాళ్ళు ఉండేవారు. మొదటి భిక్షగాడు చాలా తెలివైనవాడు, లౌక్యపరుడు. రెండో వాడు సాధారణ వ్యక్తి, భక్తుడు. ప్రతిరోజు ఇద్దరూ, భిక్షకు వెళ్ళి ఆ వచ్చినదానితో బ్రతికేవారు. మొదటి భిక్షగాడు భిక్షకి వెళ్ళిన ప్రతిసారీ **'రాజాధీనం భిక్షామ్ దేహి!'** అనేవాడు. అది విన్న ఊరివాళ్ళు అందరూ, 'ఈ బిక్షగాడు రాజుగారి మనిషిలాగా వున్నాడు', అని అనుకొని రాజుగారంటే ఎలాగూ భయము, భక్తి వుంటాయి కనుక, అతనికి అడిగినప్పుడల్లా భిక్ష వేసేవారు. రెండో వాడు ఎప్పుడు అడిగినా **'దైవాధీనం భిక్షామ్ దేహి!'** అనేవాడు. నిరంతరం నామస్మరణ చేసుకునేవాడు. కొంతమంది డబ్బులు ఇచ్చేవారు, కొంతమంది పట్టించుకునేవారు కాదు.

ఒక మకర సంక్రాంతి రోజున ఇద్దరూ రాజుగారి దగ్గరకు వెళ్ళారు. రాజుగారికి రెండో భిక్షగాడు మాటిమాటికీ **'దైవాధీనం భిక్షామ్ దేహి'** అని దేవుడిని కీర్తించడం కొద్దిగా చిరాకు అనిపించింది. 'దేవుడు అంత గొప్పవాడు ఐతే, ఆయనే వీడికి కావాల్సింది ఇస్తాడు. నేను ఎందుకు ఇవ్వడం' అని అనుకుని, మొదటి భిక్షగాడి వంక చూశాడు.

మొదటి భిక్షగాడు, **'రాజాధీనం భిక్షామ్ దేహి'** అని అంటాడు. రాజు గారికి ఇదేదో కొత్తగా అనిపించి, ఇతన్ని గురించి వాకబు చేస్తాడు. అందరి దగ్గర, అతను రాజు పేరు చెప్పి ఇలానే భిక్షం అడుగుతాడు అని తెలుసుకుంటాడు. ఐతే ఆ భిక్షగాడు తన అధీనంలో ఉంటాడు అని అనిపించి, అయినా సరే, సహాయం కోసం వచ్చాడు కనుక, అతనికి ఒక ప్రత్యేకమైన బహుమతిని ఇవ్వాలని అనుకుంటాడు.

ఒక గుమ్మడికాయని లోపల ఉన్న గుజ్జు అంతా తీసేసి, వజ్రాలు, మాణిక్యాలు, బంగారపు నాణేలు వేసి దాన్ని మళ్ళీ మాములుగా ఉన్నట్టుగా తయారు చేసి, ఆ భిక్షగాడికి దానంగా ఇస్తాడు. రెండో భిక్షగాడికి ఏమీ ఇవ్వకుండానే పంపిస్తాడు. అయినా కూడా రెండో భిక్షగాడు ఏమీ అనకుండా వెళ్ళిపోతాడు. గుమ్మడికాయను తీసుకున్న మొదటి భిక్షగాడు, చాలా నిరాశ చెందుతాడు.

'ఎంతో ఆశ పడ్డాను, రాజు ఏదో చాలా దానం చేస్తాడు, దానితో నేను సంతోషంగా ఉండవచ్చు అని అనుకున్నాను. కానీ, కేవలం ఒక గుమ్మడికాయ ఇచ్చాడు రాజు. ఇది నాకు ఎందుకూ ఉపయోగపడదు కనుక, దీనిని అమ్మితే కనీసం రెండు రూపాయలైనా వస్తాయి', అని అనుకుని ఒక కూరగాయలు అమ్మేవాడి దగ్గరకు వెళ్ళి 'ఈ గుమ్మడికాయ కొంటారా? నేను మా ఇంట్లో దీన్ని పండించాను. కావాలంటే మీకు రెండు రూపాయలకే ఇచ్చేస్తాను' అంటాడు. ఆ కూరగాయలు అమ్మేవాడు ఆ గుమ్మడికాయని చూసి 'నేను ఒక రూపాయి ఇస్తాను' అని చెప్పి దాన్ని కొంటాడు.

కాసేపయ్యాక ఆ దారివెంట రెండో బిక్షగాడు వస్తాడు. అతనికి పొద్దుటనుండీ ఎవరూ ఏమీ ఇవ్వరు. అందువలన ఈ కూరగాయలు అమ్మేవాడిని చూడగానే **'దైవాధీనం భిక్షాం దేహి'** అని అంటాడు. ఆ కూరగాయలు అమ్మేవాడు తనలో తాను 'ఇవాళ మకర సంక్రాంతి. నేను ఇవాళ ఏ మంచి పని చేయలేదు. కనీసం ఈ భిక్షగాడికైనా ఏదైనా దానం చేస్తే నాకు పుణ్యం వస్తుంది' అని అనుకొని ఆ గుమ్మడికాయని ఆ భిక్షగాడికి ఇచ్చేస్తాడు. ఆ భిక్షగాడు చాలా సంతోషిస్తాడు. కనీసం నేను ఇవాళైనా కడుపునిండా భోజనం చేస్తాను అని అనుకుంటాడు.

ఆ తర్వాత రోజు మొదటి భిక్షగాడు మళ్ళీ రాజాస్థానానికి వెళ్ళి **'రాజాధీనం భిక్షాం దేహి'** అని అడుక్కోవడం మొదలుపెడతాడు. రాజుగారు చాలా ఆశ్చర్యపడి అతన్ని పిలిచి 'మళ్ళీ ఇలా వచ్చావేంటి? నిన్ననే కదా నేను నీకు గొప్ప బహుమానాన్ని ఇచ్చాను. దాంతో నువ్వు ఏం చేశావు?' అని అడుగుతాడు.

అప్పుడు ఆ బిక్షగాడు నవ్వి, రాజుగారికి నమస్కరించి, 'రాజా! మీరు చెప్పింది నిజమేనండి. మీరు చాలా గొప్ప బహుమతినే నాకు ఇచ్చారు నిన్న. నేను అలాంటి గుమ్మడికాయని ఎప్పుడూ చూసి లేను. అందువల్ల నేను, నా కుటుంబము దాన్ని చాలా హాయిగా వండుకుని భోంచేశాము' అని చెప్తాడు. రాజు ఈ సమాధానానికి ఇంకా ఆశ్చర్యపోతాడు . 'నిజం చెప్పు! ఏంటి నువ్వు ఆ గుమ్మడికాయ వండుకుని తిన్నావా? ఏం అబద్ధాలు ఆడుతున్నావా? నీ తలని నరికించేస్తాను'

అంటాడు. వెంటనే ఆ భిక్షగాడు చాలా భయపడిపోయి "రాజా మీకు నేను మొత్తం నిజం చెప్పేస్తాను. నాకు నిన్న డబ్బు అవసరం అయి ఆ గుమ్మడికాయని ఒక కూరగాయల వ్యాపారికి బజార్లో అమ్మేశాను" అని చెప్తాడు.

రాజు వెంటనే తన భటులని వ్యాపారి దగ్గరకు పంపి అతనిని తీసుకుని రమ్మంటాడు. ఆ కూరగాయల వ్యాపారి రాజు దగ్గరికి వస్తాడు. అప్పుడు రాజు కూరగాయల వ్యాపారితో 'నిజం చెప్పు. నిన్న నువ్వు ఇతను అమ్మినటువంటి గుమ్మడికాయని కొన్నావా? ఎంత పెట్టి కొన్నావ్? అది ఇప్పుడు ఎక్కడ ఉంది? నా దగ్గరికి తీసుకునిరా' అంటాడు.

వెంటనే ఆ కూరగాయల వ్యాపారి భయపడిపోయి 'అవును రాజుగారు! నేను నిన్న ఆ గుమ్మడికాయ ఇతని దగ్గర కొన్నాను. కానీ అది నేను ఒక భిక్షగాడికి భిక్షం కింద ఇచ్చేసాను' అంటాడు. అప్పుడు రాజు వెంటనే 'ఆ భిక్షగాడిని పట్టుకురా. నాకు ఆ గుమ్మడికాయ కావాలి' అంటాడు. అప్పుడు మొదటి భిక్షగాడు ఇంకా ఆశ్చర్యపోతాడు. రాజుగారు ఆ బిక్షగాడిని తెమ్మంటున్నారు ఏమిటి? అని.

అప్పుడు రెండో భిక్షగాడు వచ్చిన తర్వాత రాజుగారు తెలుసుకుంటాడు తాను ఆ భిక్షగాడికి ఏమీ ఇవ్వకపోయినా భగవంతుడే అతనికి సరియైనటువంటి బహుమానం ఇచ్చాడు అని, తనని పొగిడిన వాడి కంటే భగవంతుడిని కీర్తించిన వాడు గొప్పవాడు అయ్యాడు అని. తప్పు చేశాను అని గ్రహించాడు. మొదటి భిక్షగాడు కూడా జరిగింది తెల్సుకుని, బుద్ధి మార్చుకున్నాడు.

***వ్యామోహ తరంగాలలో, సంసార సాగరంలో తలమునకలై దరిచేరే దారి కానక, చేయూత కోసం పరితపిస్తున్న తన బిడ్డలను ఆదుకొమ్మనీ, చేదుకొమ్మనీ, చేయూతనిమ్మని కరుణామయి అయిన జగన్మాత నన్నిక్కడ నిలిపింది.***

\- శ్రీ బాబూజీ

(గత సంచిక తరువాయి) **నిరీక్షణ** తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

కిష్కింధ చేరుకొనిన పిదప, విచారంతో నిండిన వదనుడై వున్న రాముని వద్దకు వెళ్లిన హనుమంతుడు తన లంకాపయన విషయాల నన్నింటినీ ఒక్కటి కూడ విడువక వివరించి చెప్పి, “శీలవతియైన సీతా దర్శనభాగ్యం మీ మూలంగా నాకు కలిగింది” అన్నాడు. ఇంకా హనుమంతుడు ఈ విధంగా తెలియజేశాడు. “తండ్రీ! మీరు ఆమె కళ్లలో ఉన్నారు. మాటలలో ఉన్నారు. ఆమె పడిన గాయమందలి అణువణువూ మీరున్నారు. సౌశీల్యమునకు ప్రతీకగా విరాజిల్లుచున్న అమ్మ పునీతమైన మేను దుమ్ముతో పేరుకుపోయినప్పటికీ, ఆమె రేయింబవళ్ళూ మీ కొరకే చింతించుచూ దినమొక యుగంగా గడుపుచున్నారు. ఆ లంకానగర భీరువు చేయు ఆర్భాటముగాని, బెదిరింపుగాని, అసుర స్త్రీల మందలింపు గానీ ఆమె ఎంతమాత్రమూ లక్ష్యపెట్టకపోయినా, ఒక్క క్షణం తన జీవితమును అంతం చేసుకొనవలయునన్న ఆమె తలంపును మీ దయచేత నివారించగలిగాను. ఇంకొక్క మాసకాలం మాత్రమే తాను వేచియుంటానని మీతో అమ్మ తెలియజేయమంది. గాన, ఇక ఆలస్యం చేయక ఆ అసుర కులమునంతటినీ నాశనమొనర్చి అమ్మను విముక్తురాలినిజేయు కార్యమునకు పూనుకొనవలయును”.

పిదప సీత తనకు ఇచ్చిన చూడామణిని రామునకు కడు భక్తితో హనుమంతుడు అందజేసాడు. దానిని రాముడు తీసుకుని తన హృదయమునకు హత్తుకున్నాడు. ఆతని కళ్ళు కొలనులయ్యాయి. కన్నీరు ధారగా వెలువడుచుండ రాముడు హనుమను జూచి, “సీతయు, నేను ఇంకా ప్రాణాలతో మిగిలియున్నాము అంటే అదంతా నీ చలవేన”ని చెప్పి, హనుమంతుని ఆలింగన మొనర్చుకున్నాడు.

ముక్తినిచ్చు సంతోషము కంటే రాముని ఈ ఆలింగనము మిక్కిలి మహత్కరమైనదని హనుమ గ్రహించాడు.

**<u>నిర్మించబడింది సేతు</u>**

మనోవ్యాకులత నుండి బయటపడిన రాముడు, సుగ్రీవుడు ఇకపై చేయవలసిన కార్యమునుగూర్చి చర్చించుకున్నారు. వారి ప్రణాళిక ప్రకారం ఒక పెద్ద వానర సేనతో వారందరూ లంకవైపుకు

పయనమయ్యారు. దక్షిణ సముద్రతీరము వరకు పయనించుచున్న ఆ సేనను ఆకాశమందు సంచరించుచున్న రావణుని తమ్ముడు విభీషణుడు మరియు నలుగురు రాక్షసులు జూచి, వానర సేన వద్దకు వచ్చి, "లంకాధిపతిచే అవమానింపబడిన మేము రాముని శరణు వేడుకొన నిశ్చయించుకున్నాము. ఆ ప్రభువును మమ్మల్ని స్వీకరించమని వేడుకొనుచున్నాము!" అన్నారు.

వీరు ఎలా ఇచ్చటకు వచ్చారో చూద్దామా!?..... హనుమంతుడు లంకాపురిని దహించి, నాశనమొనర్చిన తీరు రావణుని భయమునకు గురిచేసింది. వెంటనే ఆతడు తన సహోదరులను, ఇంద్రజిత్తు వద్దనున్న తన ప్రజలను, మంత్రులను రప్పించి అత్యవసర సమావేశము గావించాడు. విభీషణుడు మినహా మిగిలిన వారందరూ "రామ లక్ష్మణులను, వానరసేనను వారు వసించియున్న ప్రదేశమునకే వెళ్ళి, నాశనం గావించవలెను" అన్నారు.

విభీషణుడు, "సీతను అపహరించుట మహా అపరాధమనియు, మనము మన అసురకులము ఖచ్చితంగా వినాశనము నుండి కాపాడబడ వలయుననియు, దానికి ఒకే ఒక్క మార్గము రామ పత్నిని ధర్మబద్ధముగ రామునికి అప్పగించుటయే అని అన్నాడు. ఇంతేగాక, అనేక వరములు పొంది, తనకు మరణం లేదని విర్రవీగిన హిరణ్య కశ్యపుని ఘోరమైన ముగింపును వారి జ్ఞప్తికి తీసుకుని వచ్చి, విధితో ఆటలాడ వలదు. ప్రతి బలవంతునికి తనను మించిన బలవంతుడు విశ్వమందు వుంటాడన్న విషయమును నీవు తెలుసుకొనవలయును అన్నా!" అని రావణునితో చెప్పాడు.

ఆగ్రహావేశముతోనున్న రావణుని మేని కదలాడ, "విభీషణా! హిరణ్యునికి పుత్రుడు ప్రహ్లాదుడు శతృవైనట్లు నాకు తమ్ముడవైన నీవు శత్రువుగా దాపురించావు. కొద్ది రోజులుగా నీ నడత సరిగ్గా లేదు. మన శత్రువులను మెచ్చుకుని మాటలాడుచుంటివి. నీవు ఆ వానరుని చంపనివ్వక పోవడంచేతనే మన లంకానగరమంతా ఇప్పుడు దహించి వేయబడింది. నీ కుమార్తె త్రిజటను పంపి సీతను అనునయించునట్లు చేసావు. నీ మనసులో అసలు ఏమనుకొనుచున్నావు?" అని గర్జించాడు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**గురు వక్త్రేస్థితా విద్యా గురుభక్త్యాచ లభ్యతే**
**త్రైలోక్యే స్ఫుట వక్తారో దేవర్షి పితృమానవాః 42**

**పదవిభాగము** :-

గురువక్త్రే-స్థితా-విద్యా-గురుభక్త్యా-చ-లభ్యతే- త్రైలోక్యే-స్ఫుట-వక్తారో-దేవ-ఋషి-పితృ-మానవాః.

**టీక** :- గురువక్త్రే=గురుదేవుని ముఖ కమలము నందు; స్థితా= ఉన్న; విద్యా= బ్రహ్మావిద్య; గురుభక్త్యా= గురుభక్తి చేతనే; లభ్యతే=లభించును(అని) త్రైలోక్యేచ=మూడు లోకములందును; దేవ= దేవతలు; ఋషి=ఋషులు; పితృ=పితృదేవతలు; మానవాః=మానవులు; స్ఫుట=స్పష్టముగా; వక్తారః= చెబుతున్నారు.

**వ్యాఖ్య** :- "గురుదేవుల ముఖస్థితమైన బ్రహ్మావిద్య, గురుభక్తివలన మాత్రమే పొందబడునని మూడులోకముల యందున్న దేవతలు, పితృదేవతలు, ఋషులు, మానవులు స్పష్టముగ చెప్పుచున్నారు". ఎందువలన గురుదేవునే అనన్యమైన భావంతో సేవించవలెనో యీ శ్లోకములో వివరించుచున్నాడు పరమశివుడు. విద్య నిగూఢమైన విత్తము, అది దొంగిలించి, బెదిరించి, గెలిచి, పోరాడి, పొందుటకు వీలుకానిది. దానిని దాని స్వంత దారుడైన గురుదేవుని భక్తితో సేవించి, ఆయన అనుగ్రహమును సంపాదించి పొందవలసినదే గాని, యింకొక విధంగా దానిని సంపాదించుటకు వీలులేదు. ఇంద్రాది దేవతలు, వశిష్ఠ విశ్వామిత్రాది ఋషులు, రామకృష్ణాది అవతారపురుషులు, బలి ప్రహ్లాదాది రాక్షసులు, శంకర, మండనమిశ్రాది మానవులు ఎల్లరును గురు సేవ వలననే బ్రహ్మా జ్ఞానమును పొంది ఆత్మానందమును అనుభవించినట్లుగా మనకు చరిత్ర తెలియజేస్తున్నది. అందువలన జీవుడు బ్రహ్మామయుడగుట కేవలము గురు కృపవలననే సాధ్యమని నిరూపితమగుచున్నది.

**గుకారశ్చాన్ధకారోహి రుకార స్తేజ ఉచ్యతే**
**అజ్ఞాన గ్రాసకం బ్రహ్మా గురురేవ న సంశయః 44**

**<u>పదవిభాగము</u>** :-
గుకారః-చ-అన్ధకారః-హి-రు కారః-తేజ-ఉచ్యతే- అజ్ఞాన- గ్రాసకం-బ్రహ్మ-గురుః-ఏవ-న-సంశయః

**<u>టీక</u>** :- గుకారః='గు' అనే అక్షరమే; అన్ధకారము=అన్ధకారమనే (చీకటి); రుకారః='రు' అనే అక్షరమే, తేజః=వెలుగు(అని); ఉచ్యతే=చెప్పబడుతున్నది; అజ్ఞాన=అజ్ఞానమును; గ్రాసకః=కబళించునది (మ్రింగివేయునది); గురుః=ఏవ= గురువు మాత్రమే; నసంశయః=నిస్సంశయము.

**<u>వ్యాఖ్య</u>** :- "గు అంటే చీకటి, రు అంటే వెలుగు, చీకటిని మింగి వేసే వెలుగే గురువని నిస్సంశయముగా చెప్పబడుతున్నది". 44 నుండి 47వ శ్లోకం దాకా 'గురు' శబ్దానికి అనేక నిర్వచనాలు యివ్వబడ్డాయి. వెలుగు వచ్చినపుడు చీకటి ఎక్కడికైనా వెళ్తుందా? ఎక్కడికీ పారిపోదు, వెలుగులో లీనమైపోతుంది, అనగా చీకటి వెలుగుగా పరిణామం చెందుతుంది. అజ్ఞానియైన శిష్యుని జ్ఞాన స్వరూపునిగా చేసి, జ్ఞాన స్వరూపమైన తనలో లయము చేసే మహానుభావుడే గురు శబ్ద వాచ్యుడని యిక్కడ తెలియజేయబడుతున్నది.

- సశేషం

***భౌతిక ఆకర్షణలు, విషయవాంఛలు ప్రచండంగా బుసలు కొడుతూ మానవాళిని మార్గభ్రష్టం చేస్తాయి. విషయవాంఛల ప్రలోభంలో పడి మహా తపస్సంపన్నులే భంగపడినప్పుడు ఇక సామాన్యులెంత! చిత్త చాంచల్యాన్ని నిరోధించే బలీయమైన ప్రతిశక్తి లభించే వరకు మనస్సు తెగిన గాలిపటంలా ఎటో కొట్టుకుపోతూ వుంటుంది. నైతిక భ్రష్టత్వం, ఆధ్యాత్మిక పతనం దాపురిస్తుంది. మానవాళి నైతిక విలువలను పరిపోషించుకుంటూ, సత్యమైన ఆధ్యాత్మిక పథాన్ని అన్వేషించడానికి, ఆ పథంలో పురోగమించడానికి శక్తిని, స్ఫూర్తిని ప్రసాదించేవాడే సద్గురువు.***

- శ్రీ బాబూజీ మహరాజ్

(గత సంచిక తరువాయి) **గురుకృప** కీ.శే.- వై. లక్ష్మీనరసమ్మ

1979లో నరసమ్మగారికి కుడిభుజం విపరీతంగా లాగడం, పోటు వచ్చాయి.ఆ చేత్తో అన్నం తినడానికి కూడా శక్తి లేకుండా వుండేది. మూడు నెలలు పాటు మందులు వాడినా తగ్గలేదు. ఆవిడకి స్కూల్లో సెలవు దొరకకపోతే కాళీని ఆశ్రమానికి పంపి శ్రీబాబుకు విషయం చెప్పమని పంపారు. కాళీ శ్రీబాబుకి తన తల్లి చేతి పరిస్థితి చెప్పి బాధపడితే శ్రీబాబు నవ్వుతూ, "ఏడిస్తే తగ్గుతుందా, అలా తగ్గితే నలుగురిని పెట్టి ఏడిపించవచ్చు, సరే వీలు చూసుకొని రమ్మను మందిస్తాను" అని అన్నారు. అలాగే కొన్ని రోజుల తరువాత నరసమ్మగారు ఆశ్రమానికి వచ్చి శ్రీబాబుతో, "ఈ బాధపడలేకపోతున్నాను బాబు" అని అంటే శ్రీబాబు "ఏ చెయ్యి" అని అడిగి చెయ్యికేసి చూసి "ఛీ ఫో, ఛీ ఫో" అని మంత్రం వేసినట్లు అని "వెళ్ళు అదే తగ్గిపోతుంది" అన్నారు. **"దృష్టి ప్రసారమాత్రేణ బహుళాపన్నివారకాయ"** కదా మన గురుదేవులు. అలాగే ఆయన అభయం ఇచ్చినట్టు వారం రోజులలో తగ్గిపోయింది.

నరసమ్మగారి తల్లిగారు కూడా శ్రీబాబుయెడల విశ్వాసంతో ఉండేవారు. ఆవిడ రామాయణం, మహాభారతం, దక్షయజ్ఞం పాట రూపంలో పాడుకునేవారు. శ్రీబాబు ఆవిడని పాడమని వినేవారు. శ్రీబాబు "మామ్మగారు, మీరు ఎక్కడికీ రాలేకపోతున్నాను అని బాధపడవద్దు, నేను ఇక్కడికి వస్తుంటా కదా" అని అన్నారు.

1982లో సత్సంగం జరుపుకుందామని అన్ని ఏర్పాట్లు చేసుకోగా నరసమ్మగారి తల్లిగారు కాలం చేశారు. అప్పటి నుంచి ఆవిడ, కాళీ సత్సంగం పెట్టుకుందాం అంటే ఏమి ఆటకం వస్తుందో అని భయపడుతూ సత్సంగం ఏర్పాటుకు మళ్ళీ ముందుకు రాలేదు. అదే సంవత్సరం కాళీ పుట్టినరోజు ఆదివారంనాడు వచ్చింది. శ్రీమతి చంపకగారు (భీమవరం తాతయ్యగారి కోడలు), "నీ పుట్టినరోజు కాబట్టి ఈ ఆదివారం మీ ఇంట్లో సత్సంగం పెట్టుకుంటున్నారు అని చెప్పాను ఏర్పాట్లు చేసుకో" అని కాళీతో అన్నారు. ఆనందంతో ఒకపక్క ఏర్పాట్లు చేసుకుంటున్నా, మరోపక్క "ఏ ఆటంకాలూ రాకుండా సత్సంగం జరిపించండి బాబు" అని శ్రీబాబునే ప్రార్థిస్తూ ఆవేదన చెందుతుంటే. శనివారం రాత్రి తుమ్మలపల్లి శివగారితో శ్రీబాబు అమెరికా నుంచి

ఫోనులో మాట్లాడుతూ, “రేపు సత్సంగం ఎవరింట్లో?” అని అడిగారు దానికి శివగారు “తాతయ్యగారి ఎదురింట్లో ఉన్న టీచర్ గారి అమ్మాయి పుట్టినరోజని వాళ్ళ ఇంట్లో ఏర్పాటు చేసుకున్నారు బాబు” అంటే “అయితే, నా ఆశీస్సులు అని తెలపండి” అని శ్రీబాబు చెప్పారు. వెంటనే శివగారు, డాక్టరు స్వర్ణగారు (స్వర్ణక్క) వచ్చి “శ్రీబాబు మీకు ఆశీస్సులు చెప్పమన్నారు” అని ఎంతో సంతోషంగా కాళీకి చెప్పారు. అదే సత్సంగంలో ఒక అద్భుత సంఘటన జరిగింది. సత్సంగానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక శివగారు, “పెదనింద్రకొలను నుంచి మన గురుభక్తులు వస్తున్నారు, వాళ్ళు భజన బాగా చేస్తారు కదా, వాళ్ళకి మైకు ఏర్పాటు చేస్తే బాగుంటుంది” అన్నారు. అలాగే మైకు ఏర్పాటు చేశాక ఆ భజన విని కొందరు బయట జనం కూడా వచ్చారు. సత్సంగానికి అంచనా వేసుకొని చేయించిన ప్రసాదం అందరికీ చాలదని భయపడుతుంటే వండిన పదార్థాలు అక్షయమై ఇంట్లో వాళ్ళతో సహా అందరికి సరిపోయింది. అంత అద్భుతంగా జరిపించి, ఎంతో ఆవేదన పడుతున్న వారి హృదయాలలో ఆనందం నింపారు శ్రీబాబు.

1985లో కాళీ చిలుకూరు వెళ్ళిపోయారు. భీమవరంలో వుంటే సత్సంగాలు, శ్రీబాబు దర్శనాలు ఉండేవని, ఈ పల్లెటూరిలో ఏమీ లేకుండా వాటికి దూరం అయ్యానని బాధపడుతుంటే జ్వరం వచ్చింది. జ్వరం తగ్గాక శ్రీబాబు దర్శనార్థం ఆశ్రమానికి వెళ్ళి వారి దర్శనం చేసుకుంటే “మీది ఏ ఊరూ?!” అని పలకరించారు శ్రీబాబు. దానికి కాళీ, “భీమవరం” అని అనబోతూ “చిలుకూరు బాబు” అన్నది. “బి.ఏ చదివి అంత బెంబేలు పడతావెందుకు? అదేమైనా ఢిల్లీ లైన్లో ఉందా?!, నీకు ఏం భయంలేదు” అని అభయమిచ్చారు. శ్రీబాబు “అందరూ నావారే” అని వారందరికీ ప్రేమానురాగాలు పంచి భవబంధాలను తుంచారు, అందుకే శ్రీబాబు (మన హృదయ బాబు) మన అందరివారు. ఎవరెవరు ఎలా తలిచినా, ఎలా పిలిచినా, ఎలా కొలిచినా ఆ పిలుపులోని ఆర్తికే పలికే ఆర్తత్రాణపరాయణులు, భక్తవత్సలుడు మన బాబు. అందుకే “గత యుగములందు వారి అవతారాలను చూడలేదు అని బాధపడక ఆ అవతారాల కలయిక అయిన గురుదేవులను కనులారా చూడవే ఓ మనసా!” అని కాళీ ఇలా పద్య రూపాన్ని వ్రాసుకున్నది:

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ హెడ్మాస్టర్ (వేదాంతం శ్రీనివాస అయ్యంగార్) గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

(గత సంచిక తరువాయి)

ఆశ్రమంలో భక్తులెవరెదురైనా, చిన్నా, పెద్దా అనే తారతమ్యం లేకుండా హెడ్మాస్టరుగారు అందరినీ “మీరు” అని పలకరించేవారు.

అందరికీ నమస్కరించే వారు.



వారి ధర్మపత్ని అత్యంత అనుకూలవతియై వారిని సేవించుకున్నారు. ఆడపిల్ల వివాహ బాధ్యతలు, ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్నా హెడ్మాస్టరుగారు ఎన్నడూ శ్రీ బాబుతో చెప్పలేదు. వాటన్నిటిని అధిగమించే స్థితప్రజ్ఞత్వమును శ్రీ బాబు వారికి ప్రసాదించారు.

1987లో హెడ్మాస్టరుగారికి ధర్మపత్నీ వియోగం సంభవించినపుడు, వారు శ్రీ బాబు వద్దకు వెళ్ళి నమస్కరించగానే , శ్రీ బాబు వారిని ఆలింగనం చేసుకొని వెన్ను తడుతూ “**భవబంధాత్ ప్రముచ్యతే**” అని అన్నారు. ఆనంద బాష్పాలు రాలుస్తూ హెడ్మాస్టరుగారు ఆ మాటను ప్రతి ఒక్కరికీ చెప్పుకొని “నా భవబంధముల నుండి శ్రీ బాబు నాకు విముక్తి కలిగించారు” అనేవారు. అప్పటి నుండి గురుకులమే వారికి శేషజీవిత భాగస్వామిని అయింది. ఇంట్లో వారి ధర్మపత్ని మాసికాలు, ఆబ్దికాలు జరుగుతున్నా అవన్నీ తమ కుమారులు నిర్వహించుకునే బాధ్యతలే అని వారికే వదలి, వారు మాత్రం స్కూలుకు వచ్చేసేవారు.

స్కూలు వార్షికోత్సవాలకు గాని, యితర ఉత్సవ సమయాలలో గాని శ్రీ బాబుకు తులసీమాలను అలంకరించటానికి అయ్యంగారు చాల యిష్టపడే వారు. స్కూలులో తాము దగ్గర ఉండి టీచర్లందరితో కలిసి తులసీమాలను గ్రుచ్చి, అందరితో కలిసి ఆ మాలను శ్రీ సద్గురుదేవులకు అలంకరిస్తూ ఆనందపడిపోయేవారు. అలాగే చెర్రీపండ్లను స్వామికి నైవేద్యం పెట్టించే వారు. శ్రీ బాబు ఒక పండు తాము తీసుకుని, ఒకటి హెడ్మాస్టరుగారి నోటికి అందించేవారు. హెడ్మాస్టరుగారు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బైపోయేవారు.

శ్రీ బాబు అవతార పరిసమాప్తికి రెండురోజుల ముందు, ఆశ్రమంలో ఒక సత్సంగ సమేవేశం జరిగింది. శ్రీ బాబు హెడ్మాస్టరుగారిని ముందుగా కాసేపు

మాట్లాడమన్నారు. వారు లేచి మాట్లాడుతూ 'Why Fear ? I am here' అని శ్రీ బాబు అన్నట్లే నేనూ అంటాను" అన్నారు. ఎవరికీ అర్థం కాలేదు. "ఆ అభయ వాక్యం పలకటం గురుదేవులకే చెల్లుగాని, యీయన అనడమేమిటి?" అని గుసగుసలు మొదలైనాయి. హెడ్మాస్టరుగారు "అవును I am here' – అంటే నేను యిక్కడ (అని శ్రీ బాబు పాద పద్మములను చూపుతూ) ఈ గురుపాద సన్నిధిలో ఉన్నాను Why Fear ?– ఇక నాకు భయమెందుకు?" అని, "నేనే కాదు; మనమందరము గుండెల మీద చెయ్యి వేసుకుని అలా నిర్భయంగా చెప్పవచ్చును" అన్నారు. శ్రీ బాబుతో సహా అందరూ మెచ్చుకోలుగా కరతాళధ్వనులు చేశారు. తరువాత శ్రీ బాబు తమ దివ్యబోధను అందిస్తూ "త్రికరణ శుద్ధిగా శ్రీగురు పాదములను ఆశ్రయించుకొని ఉన్న నిజ శిష్యునికి మాత్రమే అటువంటి గుండె నిబ్బరం ఉంటుంది" అన్నారు.

ఆ సమావేశానంతరం భక్తులకు సమారాధన జరిగింది. సాంబారు వడ్డిస్తుంటే హెడ్మాస్టరుగారు అందులో ఉల్లిపాయ ఉన్నదని వద్దన్నారు. "మీరు ఉల్లిపాయ తినరా?" అని వడ్డించే వారు అడిగితే , హెడ్మాస్టరుగారు "నాకది చిన్నప్పటి నుంచి ఏ మాత్రం నచ్చదు. ఒకసారి బలవంతంగా తింటే వాంతి అయింది. ఈ జన్మలో మళ్ళీ ఉల్లిపాయ ముట్టుకోరాదనిపించింది" అన్నారు. శ్రీ బాబు యీ మాట విని నవ్వుతూ "అయితే ఉల్లిపాయ తినడం కోసం యింకో జన్మ కావాలంటారా?" అని అడిగారు. హెడ్మాస్టరుగారు "ఉల్లిపాయా వద్దూ, యింకొక జన్మా వద్దు బాబూ!" అన్నారు. శ్రీ బాబు "ఇక మీకు జన్మ లేదు లెండి" అన్నారు.

- సశేషం

***ఎవరి దివ్య ప్రబోధం భగవంతునిలో అకుంఠిత విశ్వాసాన్ని ప్రదీప్తం చేస్తుందో, ప్రజలకు తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చడానికి ఎవరు ప్రోత్సాహం ఇస్తారో, ఎవరు ప్రజల మానసిక, దైహిక రుగ్మతలను రూపుమాపి ఆధ్యాత్మిక పురోగతికి ఆచరణ యోగ్యమైన పధాన్ని నిర్దేశిస్తారో ఆయనే నిజమైన సద్గురువు!***

- శ్రీ కాళీబాబు


విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

# త్రైలింగ స్వామి

సమస్త శ్రోతలను ఆశ్చర్య చకితులను చేయగల ధన్య జీవులైన రాజయోగులలో బ్రహ్మాభూతులైన శ్రీ త్రైలింగస్వామి వారి అనన్య సాధారణమైన గాథలు ఎన్నో ఉన్నాయి. ఎన్నో యోగశక్తులు వారు ప్రదర్శించారు.

17వ శతాబ్దం ప్రారంభంలో విజయనగరానికి సమీపంలో ఉన్న హెూలియా గ్రామంలో నృసింహధరుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. వారికి చాలాకాలం సంతానంలేదు. దైవానుగ్రహం చేత 19-12-1607 – ప్లవంగ పుష్య శుద్ధ ఏకాదశి రోహిణీ నక్షత్రంలో మొదటి భార్యకు ఒక పుత్రుడు జన్మించాడు. జ్యోతిష్య పండితులు "ఇతడు భారతదేశంలోనే ఒక ఉజ్జ్వల రత్నం అవుతాడ"ని భవిష్యవాణి పలికారు. పుత్రోదయం అయిన సందర్భంగా నృసింహుడు అనేక దానధర్మాలు చేసి పుత్రుడికి "త్రైలింగధరుడు" అని పేరు పెట్టాడు.



త్రైలింగధరుడు బుద్ధిమంతుడై సత్త్వ స్వభావంతో మెలిగేవాడు. ఆయన జ్ఞాపకశక్తి అద్భుతం. ఆయన ఏకసంధాగ్రాహి. ఇతరుల కష్టాలకు ఆయన కృంగిపోయేవాడు. ఎప్పుడూ నిర్జన ప్రదేశంలో ఏకాంతంగా ధ్యానముద్రలో ఉండేవాడు.

కొంతకాలం తరువాత నృసింహధరుడి రెండవ భార్యకు కూడా ఒక కుమారుడు జన్మించాడు. అతడికి శ్రీధరుడు అని పేరు పెట్టారు.

త్రైలింగధరుడి తల్లి విద్యావతి. ఆమె సుగుణాలరాశి. ఎవరితోనూ కఠినంగా మట్లాడేది కాదు. త్రైలింగధరుడు పెద్దవాడయ్యాడు. అతనిలో ఉండవలసిన మానసిక వికాసం లేకపోగా ఎల్లప్పుడూ అన్యమనస్కుడై ఉండేవాడు. తల్లిదండ్రులు పెళ్ళి ప్రస్తావన తెస్తే ఆయన "నశ్వరమైన ఈ జీవితం కొరకు తాపత్రయం ఎందుకు? అనశ్వరమైనది, సుస్థిరమైనదానిని అన్వేషించటమే నా ధ్యేయం" అని చెప్పాడు.

విద్యావతి తన భర్తతో "వివాహ విముఖుడైన త్రైలింగధరుని బలవంత పెట్టవద్దు. రెండవ పుత్రుడైన శ్రీధరుడికి వివాహం చేద్దాం" అని సలహా ఇచ్చింది. శ్రీధరునికి వివాహం చేశారు.

వయసు్స పెరిగే కొలదీ త్రైలింగధరునిలో ధార్మిక చింతన పెరుగుతూ వచ్చింది. ఆహారవిహారాలు, అధ్యయన,శయనాదులపై ఏమాత్రం అభిరుచి కనబరచేవాడు కాదు. ఎప్పుడూ వ్యాకులతతో ఉండే అతనికి విద్యావతి ఎన్నో ఉపదేశాలు చేసింది. తల్లి చేసే ఉపదేశాలు అతనిలో అమృతం నింపినట్లు ఉండేవి. అతని హృదయంలో భగవత్ప్రేమ విలసిల్లింది. అతనిలో భగవద్భక్తి ప్రస్ఫుటం కాసాగింది.

కొంతకాలానికి నృసింహధరుడు జ్వర పీడితుడై మరణించాడు. అప్పటికి త్రైలింగధరునికి 40 సంవత్సరాలు. తండ్రి మరణానంతరం 12 సంవత్సరాలు భగవచ్చింతనతో గడిపాడు. అతని తల్లి విద్యావతి కూడా స్వర్గస్తురాలైంది. తల్లి మరణంతో త్రైలింగునికి ప్రపంచం అంతా శూన్యంగా కనిపించసాగింది. ప్రపంచం విషతుల్యం అనిపించసాగింది. త్రైలింగధరుడు సంసార బంధాలను త్రెంచుకుని శ్మశానంలో నివసించసాగాడు. అతని తమ్ముడైన శ్రీధరుడు ఇంటికి రమ్మని ఎంతగానో బ్రతిమిలాడాడు. కాని ఫలితం శూన్యం.

తండ్రిగారి సంపత్తిని అతనినే అనుభవించమన్నాడు. “నేను ఇక ఇంటికి రాను. ఆద్యంతరహితమైన వస్తువును పొందటమే నా ధ్యేయం” అని ప్రబోధించాడు. 20 సంవత్సరములు గడిచాక ఒక మహాత్ముని కలవాలి అనే కోరిక కలిగింది. కొంతకాలం తరవాత పాటియాలాలో బస్తూరు అనే గ్రామంలో భగీరథస్వామి అనే సుప్రసిద్ధ యోగిని 1679లో త్రైలింగస్వామి కలిశారు. భగీరథస్వామి అతనికి మంత్రదీక్షను ఇచ్చి అతని పేరు “గణపతి స్వామి” అని పెట్టారు. 1695వ సంవత్సరంలో భగీరథస్వామి పార్థివ శరీరాన్ని విడిచిపెట్టారు.

కొంతకాలం గణపతిస్వామి పుణ్యక్షేత్రాలను దర్శించి సేతు రామేశ్వరం చేరాడు. రామేశ్వరంలో భారీ ఎత్తున ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాలకు వచ్చిన ఒక వృద్ధ బ్రాహ్మణుడు మరణించాడు. ఆ బ్రాహ్మణుని బంధువులు పెద్దగా విలపించసాగారు. ఆ వృద్ధ బ్రాహ్మణునికి దహన సంస్కారాలు చేయటానికి సిద్ధమయ్యారు. ఆ సమయంలో గణపతిస్వామి అక్కడి వారిని ఆపి తన కమండలంలో నీటిని చల్లారు. క్రమక్రమంగా స్పృహ వచ్చింది. అతనికి పాలు త్రాగించమని సలహా ఇచ్చి వెళ్ళిపోయాడు.

- సశేషం

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## మార్చి 6 నుండి 10 వరకు జరిగిన శ్రీ కాళీవనాశ్రమం, భీమవరం శాఖ ప్రథమ వార్షికోత్సవ దృశ్యములు









REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## మార్చి 3 న జరిగిన ఆశ్రమ పాఠశాలవార్షికోత్సవ దృశ్యములు







If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.